తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం

సంపుటి :03, సంచిక :11 హైదరాబాద్: సంపాదకులు: గున్నాల అనిల్ రెడ్డి, ఆదివారం జులై 06, 2025, పేజీలు -12, వెల -5/-

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur









## చిన్నారులపై లైంగిక దాడి కేసుల్లో

# కఠిన శిక్షలు

●సామాజిక మాధ్యమాల విషయంలో జాగ్రత్తలు ●లైంగిక వేధింపుల నుంచి పూర్తిస్థాయి రక్షణకు చర్యలు ●పిల్లలు, మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం ●లైంగిక దాడులపై సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూలై5(తెలుగు వెలుగు):** చిన్నారులు, మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు అండగా ఉంటున్నట్లు చెప్పారు. 'లైంగిక దాడుల బాధిత చిన్నారుల రక్షణ, భద్రత' అంశంపై హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నారులపై లైంగిక హింసను అందరూ ఖండించాలన్నారు. ఇలాంటి కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సదస్సులో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు న్యాయమూర్తులు, డీజీపీ జితేందర్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టేట్ లెవెల్ స్టేక్ హోల్డర్స్ కన్సల్టేషన్ మీట్-2025 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్ అనే థీమ్ తో.. తమ బాధను చెప్పుకోలేని వారికి రక్షణ కల్పించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం చాలా అవసరం అన్నారు. ఎంతో కీలకమైన అంశంపై సదస్సు నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసు, ఇతర నిర్వాహకులను అభినందిస్తున్నా.. ఇలాంటి

మిగతావి 2లో

# ఎన్‌డిఎకు జాతి ప్రయోజనాలే ముఖ్యం

☛ఏ దేశంతో అయినా ఒప్పందాల్లో ఇదే ప్రధానం
☛కాంగ్రెస్ విమర్శలను తిప్పికొట్టిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



**న్యూఢిల్లీ,జూలై5(తెలుగు వెలుగు):** ఎన్డీఏ ప్రభుత్వానికి జాతీయ ప్రయోజనాలే మొదటి ప్రాధాన్యత అని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సుంకాల విషయంలో ప్రధాని ఓ నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం దేశ ప్రజల గురించి పట్టిం చుకోక పోవడం వల్ల

మిగతావి 2లో

# ట్రంప్ సుంకాలకు తలొగ్గుతారు చూడండి

- పీయూష్ గోయల్ వ్యాఖ్యలకు రాహుల్ కౌంటర్



**న్యూఢిల్లీ,జూలై5(తెలుగు వెలుగు):** ట్రంప్ సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గు తా రని.. తన మాటలు నమ్మ కపోతే రా సిపెట్టుకోవాలని విపక్షనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. అమెరికాతో వాణిజ్య

మిగతావి 2లో

## అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన

# రామచంద్రరావు

☛గజమాలతో సత్కరించిన బిజెపి అగ్రనేతలు
☛బిజెపి విధానాలు నచ్చని వారు పార్టీని వీడినా నష్టం లేదు
☛మీడియా సమావేశంలో కొత్త అధ్యక్షుడి స్పష్టీకరణ



**హైదరాబాద్,జూలై5(తెలుగు వెలుగు):** భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.రామచందర్ రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాషాయ నేతలు ఆయన్ను గజమా లతో సత్కరించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను రామచందర్ రావుకు కిషన్ రెడ్డి అప్పగించారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షుడికి బీజేపీ శ్రేణులు అభినందనలు తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి అధ్యక్షుడి వరకు రావడం

మిగతావి 2లో



## ఆస్పత్రి నుంచి కెసిఆర్ డిశ్చార్జ్

## మంత్రి సీతక్కకు వచ్చిన మావోల లేఖ ఫేక్



# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

☛అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు
☛ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భట్టి



**హైదరాబాద్,జూలై5(తెలుగు వెలుగు):** అవకాశం ఉన్న ప్రతిచోట మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు అండగా ఉంటుందని చెప్పారు. ప్రజాభవన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఆర్టీసీకి అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. తొలి నెల అద్దె కింద రూ.1.49 కోట్లు- ఆయా సంఘాలకు.. మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, సీతక్క అందించారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళలు వ్యాపార వేత్తలుగా రాణించేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే

మిగతావి 2లో



# శ్రీకృష్ణనగర్ బస్తీలో మురుగునీరు పారకం

## - మున్సిపల్ అధికారుల తీరుపై కేంద్రమంత్రి ఆగ్రహం

**హైదరాబాద్,జూలై5(తెలుగు వెలుగు):** కాలనీల్లో మురుగునీరు ప్రవహిస్తున్నా చర్యలు తీసుకోరా అంటూ.. మున్సిపల్ అధికారులపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంటిముందు ఇలా ఉంటే ఎలా ఉంటుందో

మిగతావి 2లో

## వ్యవసాయంపై ఎక్కడ చర్చ పెట్టినా

# సిద్ధమే...

☛సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటా ☛ఎవరు రైతులకు మేలు చేశారో...చేయలేదో తేలుస్తాం ☛ఈ చర్చకు కేసిఆర్ అవసరం లేదు...నేను చాలు ☛మీడియా సమావేశంలో రేవంత్‌కు కెటిఆర్ సవాల్



## స్టాంప్ సవరణ చట్టం కోసం

# కసరత్తు

- అసెంబ్లీలో సవరణకు నిర్ణయం
- అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,జూలై5(తెలుగు వెలుగు):** రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సాధారణ ప్రజలకు నష్టం కలిగించకుండా వ్యాపార ఒప్పందాలపై పారదర్శకత ఉండేలా స్టాంప్ విధానాన్ని అమలు చేయాలనుకుంటున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇందుకు అనుగుణంగా తెలంగాణ సవరణ బిల్లు-2025ను తీసుకురావాలని నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మిగతావి 2లో

## ట్రంప్ సుంకాలకు తలొగ్గుతారు చూడండి

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందంపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప చేసేదేమీ ఉండదని రాహుల్ పేర్కొన్నారు. మూడు నెలల క్రితం భారత్‌పై 26 శాతం సుంకాలు విధిస్తున్నట్లు- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. 90 రోజుల విరామం తర్వాత అది అమల్లోకి రాకుండా ఉండేందుకు వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి భారత్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా పరస్పర సుంకాల సస్పెన్షన్ జులై 9న ముగియనున్నందున, ఆ గడువుకు ముందే చర్చలు పూర్తి చేయాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శు క్రవారం కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ పటిష్ఠ విధానాలను కలిగిఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. సమయం దాటిపోతున్నా ప్రధాని మోదీ సుంకాల తగ్గింపునకు అగ్రరాజ్యంతో ఎటువంటి చర్చలు జరపట్లేదని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ఇలాగే నిశ్శబ్దంగా ఉండి చివరికి ట్రంప్ విధించిన సుంకాలకు తలొగ్గడం తప్ప వేరే దారి ఉండదని వ్యాఖ్యానించారు.

## ఆస్పత్రి నుంచి కెసిఆర్ డిశ్చార్జ్



**హైదరాబాద్,జూలై5(తెలుగు వెలుగు):** మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా ఆయన గురువారం ఆసుపత్రిలో చేరారు. బ్లడ్ షుగర్, సోడియం స్థాయులు మానిటర్ చేయడానికి ఆసుపత్రిలో చేరాల్సిందిగా వైద్యులు సూచించారు. ఆయన రెండు రోజులు అక్కడే ఉండి చికిత్స పొందారు. ప్రస్తుతం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో శనివారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి నందినగర్‌లోని నివాసానికి వెళ్లారు.

## మంత్రి సీతక్కకు వచ్చిన మావోల లేఖ ఫేక్



**వరంగల్,జూలై5(తెలుగు వెలుగు):** మంత్రి సీతక్కకు వార్నింగ్ ఇస్తూ వారం క్రితం మావోయిస్టులు విడుదల చేసిన లేఖ ఫేక్ అని తేలింది. ఇలాంటి లేఖ ఏదీ తాము రాయలేదని ఇప్పుడు మావో అధికార ప్రతినిధి పేరుతో ఓ లేఖ విడుదలయ్యింది. ఆ లేఖ మేం రాయలేదంటూ మరో లేఖ విడుదల చేయడంతో ఫేక లేఖ ఎవరిదన్నది ఇప్పుడు బయటపడాల్సి ఉంది. మంత్రిను హెచ్చరిస్తూ మావోయిస్టులు రిలీజ్ చేసిన లేఖపై మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ క్లారిటీ- ఇచ్చారు. ఒక అధికారిక పత్రికా ప్రకటన విడుదల చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ- పేరుతో 26.06.2025న మంత్రి సీతక్కపై వచ్చిన తాము రాయలేదని.. మా పార్టీకీ, ఆ లేఖకు ఎలాంటి సంబంధం లేదని తాజా లేఖలో స్పష్టం చేశారు. మావోయిస్టు రాష్ట్ర కార్య దర్శి బడే చొక్కారావ్ అలియాస్ లొంగుబాటులో వాస్తవం లేదని తెలిపారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లలో వారికి రూ.లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలనేది లక్ష్యమన్నారు. ఈ నెల 8న అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చించాలి. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న లబ్ధి గురించి చర్చించాలి. గ్రామాలు, మండలాల్లో మహిళా సమాఖ్య సమావేశాలు ఏర్పాటు- చేయాలి. 10 నుంచి 16 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు ఉంటాయి. వడ్డీ లేని రుణాల నగదును చెక్కుల రూపంలో అందిస్తాం. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంపై ప్రజలకు వివరించాలని భట్టి విక్రమార్క తెలిపారు.

## శ్రీకృష్ణనగర్ బస్తీలో మురుగునీరు పారకం

(మొదటి పేజీ తరువాయి)

ఊహించారా అని అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీకృష్ణనగర్ బస్తీలో శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించారు. స్థానిక కమ్యూనిటీ- హాల్ సీ బ్లాక్‌లో ఇళ్ల ముందు పెద్ద ఎత్తున మురుగునీరు పారుతుం డటంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు కిషన్‌రెడ్డి ఎదుట వాపోయారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. తీవ్ర ఆగ్రహం చెందిన ఆయన.. జీహెచ్‌ఎంసీ కమిష నర్‌తో ఫోన్లో మాట్లాడారు. వెంటనే మురుగు సమస్యను పరిష్క రించాలని ఆదేశించారు. 'మీ ఇంటి ముందు ఇలా మురు గు ఉంటే ఒక్క నిమిషమైనా ఉండగలరా?' అని తీవ్రంగా మందలించారు.

## చిన్నారులపై లైంగిక దాడి కేసుల్లో కఠిన శిక్షలు

(మొదటి పేజీ తరువాయి)

నేరాలను నియంత్రించడమే కాకుండా బాల బాధితులకు చట్టపరమైన అన్ని రకాల రక్షణ కల్పించాల్సి ఉంది. లైంగిక వేధింపుల నుంచి అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మా ప్రభుత్వం పిల్లలు, మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. బాలికల సంరక్షణ కోసం తెలంగాణ భరోసా ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు. అనుసంధానంగా 29 కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా పోలీసు సహాయమే కాకుండా న్యాయ పరమైన సహాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భరోసా కేంద్రం ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడం ఈ కేంద్రాల లక్ష్యం అని వివరించారు. పోక్సో చట్టం, జ్యువెనైల్ చట్టాలు మన ప్రగతిశీల సాధనాలుగా పనిచేస్తున్నాయి. అయితే ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి హాని కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలి. సోషల్ మీడియా ద్వారా పిల్లలపై జరిగే దురాగతాలు, దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపకుండా దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలి. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. న్యాయం కేవలం కోర్టుల్లోనే కాకుండా ప్రతి దశలోనూ రక్షణ ఉండాలి. పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కేంద్రాలతో అన్ని పక్రియల ద్వారా పిల్లలకు న్యాయం దక్కాలి. రక్షణ కల్పించాలని సిఎం అన్నారు. గౌరవ న్యాయమూర్తులు, పోలీసు అధికారులు బాలల సంక్షేమ కమిటీ-లు, ఇతర అభివృద్ధి భాగస్వామ్య సభ్యులందరికీ... విజ్ఞప్తి చేస్తున్నాను. ఇలాంటి విషయాల్లో అందరం కలిసికట్టు-గా ముందుకు సాగుదాం. న్యాయమంటే కేవలం శిక్షలు విధించడం వరకే కాదు. బాధితుల జీవితానికి భరోసా కల్పించాలి. వారికి అవసరమైన రక్షణ, సమాజంలో తగిన గౌరవం కల్పించేలా చర్యలు తీసుకుని వారి బాల్యాన్ని తిరిగి పొందేలా చర్యలు ఉండాలని అన్నారు.

## ఎన్‌డిఎకు జాతి ప్రయోజనాలే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

బలహీనంగా మారిన దేశాన్ని బలమైన, అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారన్ని తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీపై గోయల్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ హయాంలో ఆ పార్టీ నేతలు జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ఇతర దేశాలతో ఒప్పందాలు చేసుకున్నారని వ్యాఖ్యానించారు. భారత్‌కు ప్రపంచంలోని ఏ దేశంతో అయినా పోటీ- పడగలిగే సామర్థం ఉందని తాము విశ్వాసిస్తున్నామన్నారు. ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటే మాత్రమే ఏ దేశంతో అయినా వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడానికి భారత్ సంసిద్ధతను వ్యక్తం చేస్తుందని గోయల్ అన్నారు. అలా కానీ పక్షంలో ఎట్టిపరిస్థితుల్లోనే ప్రపంచ దేశాలతో వాణిజ్య సంబంధాలను ఏర్పరుచుకోమని స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్.. మారిషస్, యునైటె-డ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్, నార్వే, యూకే వంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని గోయల్ వెల్లడించారు. ప్రస్తుతం ఈయూ దేశాల కూటమి, అమెరికా, ఒమన్, పెరూ, చిలీ సహా ఇతర అభివృద్ధి చెందిన దేశాలతోనూ వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తోందని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై 26 శాతం సుంకాలు విధిస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. యూఎస్ పరస్పర సుంకాల సస్పెన్షన్ జులై 9న ముగియనున్నందున, ఆ గడువుకు ముందే చర్చలు పూర్తి చేయాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. గడువు ఆధారంగా కీలకమైన వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకునేందుకు దేశం ఎప్పుడూ తొందరపడదని అన్నారు. రెండు వర్గాలకు లాభదాయకంగా ఉంటేనే అంగీకరిస్తుందన్నారు. అమెరికాతో కుదుర్చుకోనున్న ఒప్పందంలో భాగంగా భారత్ కొన్ని కీలక రంగాల్లో సుంకాల నుంచి అగ్రరాజ్యాన్ని సడలింపు కోరుతోంది. ఇందులో టెక్స్టైల్స్, రత్నాలు, ఆభరణాలు, దుస్తులు, ఎలాస్టిక్స్, రసాయనాలు, రొయ్యలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటిపండ్లు వంటివి ఉన్నాయి. మరోవైపు అమెరికా కొన్ని పారిశ్రామిక వస్తువులు, ఆటోమొబైల్స్ (ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు), వైన్స్, పెట్రో కెమికల్ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు రంగాల్లో సుంకాల సడలింపు కోరుతోంది. అయితే ఈ సడలింపులను ఆమోదిస్తే, మన దేశంలో రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నిత అంశమైనందున, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపులకు భారత్ ససేమిరా అంటోంది. వాణిజ్య చర్చల నిమిత్తం ఇటీవల అమెరికా వెళ్లిన భారత బృందం తిరిగి వచ్చింది. దీంతో అమెరికా-భారత్ మధ్య ఈనెల 9లోగా మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది.

## అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావు

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీలోనే సాధ్యమని.. ఇందుకు తన ఎన్నికే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి స్పష్టమైన కార్యచరణతో ముందుకెళ్తామని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతామన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ చేసిన రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలిసి ఇష్టమొచ్చినట్లు హామీలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు ఉసురు తగులుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా ఇచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా కొరతపై దుష్ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను తప్పుదోవ పట్టిస్తుందని మండిపడ్డారు. కేంద్రం ఇచ్చిన యూరియాను రాష్ట్ర పాలకులు తినేశారా అని ఆరోపించారు. మోడీ, బీజేపీని తిట్టడమే కాంగ్రెస్ సామాజిన న్యాయ సభ ఉద్దేశమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ, పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. అంతకుముందు తన నివాసం నుంచి ర్యాలీగా వచ్చిన రామచందర్‌రావు ఉస్మానియా వర్సిటీలోని సరస్వతీ దేవాలయంలో, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీజేపీ విధానాలు నచ్చనివారు పార్టీని వీడినా నష్టం లేదంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ విధానాలు, నిర్ణయాలు నచ్చక ఎవరు పార్టీని వీడినా నష్టం లేదని రామచంద్రరావు అన్నారు. పార్టీని నమ్ముకున్నవారిని బీజేపీ ఎప్పుడూ మోసం చేయదని, అందుకు తానే ఉదాహరణ అని చెప్పారు. పార్టీ అభివృద్ధికి పని చేసిన వారందరికీ అవకాశాలు వస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ దోపిడీకి తెలంగాణ అక్షయ పాత్రగా మారిందని బిజెపి తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆరోపించారు. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కాంగ్రెస్ పార్టీ దోపిడీకి అక్షయపాత్రలుగా మారాయని వ్యాఖ్యానించారు. ఏడాదిన్నర కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఒక్క హామీని కూడా సమర్థంగా అమలు చేయలేకపోందని, ప్రజలకు ఏం సమాధానం చెబుతుందని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ సందర్భంగా రామచంద్రరావు స్పందిస్తూ శు క్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో 6 గ్యారంటీ-లు, 13 హామీలు అంటూ భారీగా హడావుడి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఏ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని అన్నారు. కులగణన పేరిట బీసీలకు అన్యాయం చేసి, ముస్లింలను బీసీ కోటాలో చేర్చడమే కాంగ్రెస్ సామాజిక న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు మళ్లీ మోసపోరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 70 ఏళ్ల పాలనలో వెనుకబడిన వర్గాల వారిని ఎన్నడూ ప్రధానమంత్రి గాని ముఖ్యమంత్రిగా చేయలేద ని విమర్శించారు.

## వ్యవసాయంపై ఎక్కడ చర్చ పెట్టినా సిద్ధమే...

- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటా
- ఎవరు రైతులకు మేలు చేశారో...చేయలేదో తేలుస్తాం
- ఈ చర్చకు కేసిఆర్ అవసరం లేదు...నేను చాలు
- మీడియా సమావేశంలో రేవంత్‌కు కెటిఆర్ సవాల్



**హైదరాబాద్,జూలై5(తెలుగు వెలుగు):** వ్యవసాయంపై ఎక్కడ చర్చ పెట్టినా రావడానికి సిద్ధమని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 8న సిద్ధంగా ఉంటానని, సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు రావాలన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ధ్వజమెత్తారు. రైతుల బాగుపై కాంగ్రెస్ పార్టీ నేతల మాటలు.. దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎరువులు, విత్తనాల కోసం రైతులు క్యూలైన్లలో చెప్పులు పెట్టడమేనా అని ప్రశ్నించారు. కొత్త రాష్ట్రాన్ని కేంద్రం ఇబ్బందులు పెట్టినా కేసీఆర్ నిలబడ్డారని గుర్తు చేశారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. నీటికి పల్లం ఎలా తెలుసో తెలంగాణ కు నీరు ఎవరు తీసుకు వచ్చారో అందరికి తెలుసు.. తెలంగాణ లో ఏ రైతును, ఎద్దును అడిగినా వ్యవసాయం పండుగ ఎవరు చేశారో చెప్తారు.. సీఎం నిన్న రంకెలు వేశాడు.. ఆయన సభ పెట్టాడంటే బూతులతోనే మాట్లాడతాడు.. మా పార్టీ తరుపున మీ సవాలు స్వీకరిస్తున్నాం.. ఎక్కడ చర్చ పెట్టినా వస్తాం.. మీకు కేసీఆర్ అవసరం లేదు.. మేము చాలు.. 72 గంటలు ఇస్తున్నాం.. మీరు ప్రిపేర్ అయి రండి.. సీఎంకు బేసిన్ లు తెలియదు బెండకాయలు తెలియదు.. సమైక్య రాష్ట్రంలో నీళ్లు ఇవ్వలేదు కాబట్టే తెలంగాణ ఉద్యమం పుట్టింది..సీఎం రేవంత్ రెడ్డి హయాంలో నీళ్లు ఆంధ్రకు, నిధులు ఢిల్లీకి, నియామకాలు ఆయన అనునాయులకు వచ్చాయని అంటూ విమర్శలు గుప్పించారు. ఇందిరమ్మ రాజ్యం గొప్పతనం తెలియాలి అంటే బట్టలు విప్పి కొడతాం అన్నారు.. బనకచర్ల ద్వారా మీ గురువు చంద్రబాబు తీసుకెళ్తుంటే మీ తీరు తెలంగాణ సమాజం చూస్తూనే ఉంది. బురద జల్లి తప్పించుకునే అలవాటు సీఎం కి ఉంది.. 8 వ తారీఖు 11 గంటలకు సోమజిగూడా ప్రెస్ క్లబ్ కు మేము వస్తాము.. మీరు రండి మీడియా ముందే చర్చిద్దాం.. కేసీఆర్ ప్రభుత్వం నాట్లు వచ్చినప్పుడు రైతు బంధు ఇచ్చేది... ఓట్లు వచ్చేముందు రైతు భరోసా ఇస్తుంది కాంగ్రెస్.. ఇప్పటి వరకు రైతులకు ఎకరానికి 19 వేలు ఎగ్గొట్టారు. అన్నదాతకు సున్నం పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం.. మందికి పుట్టిన బిడ్డలు నా బిడ్డలు అనడానికి సిగ్గు లేదా.. మేము ఇచ్చిన ఉద్యోగాలు మీరు ఇచ్చినట్లు- చెప్పుకుంటున్నారు.. అశోక్ నగర్ లో చర్చకు వస్తావా.. ఈ మూడు రోజులు మీకు టైం ఇస్తున్నాం.. అప్పటివరకు మీరు చెప్పకుంటే.. 8వ తేదీన మేము సోమజిగూడా ప్రెస్‌క్లబ్ లో సిద్ధం గా ఉంటాం.. మీలాగా మందబలంతో కాకుండా 10,15 మందితో వస్తాం.. ఈయన ఇచ్చే డబ్బులతో ఢిల్లీ టకీ టకీ అని మోగుతున్నాయి.. కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పినట్లు- చంద్రబాబు కోవర్ట్ రేవంత్ రెడ్డినే.. ఆ ఎమ్మెల్యే చాలా కరెక్టు గా చెప్పాడు.. అలా చెప్పిన ఎమ్మెల్యేను అభినందిస్తున్నాను అని కేటీఆర్ తెలిపారు.

## స్టాంప్ సవరణ చట్టం కోసం కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఈ సవరణ బిల్లుపై శనివారం నాడు డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి. ఎస్.లోకేష్ కుమార్, న్యాయ వ్యవహారాల కార్యదర్శి రెండ్ల తిరుపతి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డి వేముల శ్రీనివాస్ తదితరులతో సమావేశం నిర్వహించారు. భారతీయ స్టాంపు చట్టం 1899 ప్రకారం, తెలంగాణ పరిధిలో నాలుగు సెక్షన్లను మరియు 26 ఆర్టికల్స్ ను సవరించుట కొరకు 2021 సంవత్సరంలో శాసనసభలో సవరణ బిల్లును ఆమోదించి కేంద్రప్రభుత్వం ఆమోదం కొరకు పంపడం జరిగిందని అయితే ఈ బిల్లుపై కేంద్రం వ్యక్తం చేసిన అభ్యంతరాలకు సమాధానం ఇచ్చినప్పటికీ 2023 జనవరిలో భారత ప్రభుత్వం ఈ సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించడం జరిగిందని ఈ సందర్భంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2021లో ప్రవేశపెట్టిన సవరణ బిల్లును ఉపసంహరించుకొని ప్రస్తుత కాలానికి అనుగుణంగా 2025 సవరణ బిల్లును తీసుకురావాలని నిర్ణ యించినట్లు- వెల్లడించారు. సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకుని, నిబంధనలు కట్టుదిట్టమైన రూపంలోకి తీసుకురావడం కొత్త ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించడం లక్ష్యంగా బిల్లును రూపొందించాలని అలాగే పాత చట్టంలో లేనివాటిని కొత్త చట్టం పరిధిలోకి తీసుకురావాలని



అధికారులకు సూచించారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని సూచించారు. సామాన్య మధ్యతరగతి ప్రజానీకంపై ఎలాంటి భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలను సవరించాలని ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి విమర్శలకు తావులేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరల సవరణ జరగాలన్నారు. ఏఏ ప్రాంతాల్లో ఎక్కువ వ్యత్యాసం ఉంది అక్కడ హేతబద్ధంగా ఎంత శాతం పెంచేందుకు అవకాశం ఉంది తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళా భ్యదయం కోసం ఎన్నో చర్యలు చేపడు తోందని దీనిలో భాగంగా మహిళలకు స్టాంప్ డ్యూటీ- తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని అలాగే కొత్త, పాత అపార్ట్‌మెంట్ లకు స్టాంప్ డ్యూటీ- ఒకే విధంగా ఉందని పాత అపార్ట్ మెంట్‌లకు రిజిస్ట్రేషన్ తేదీలను పరిగణనలోకి తీసుకొని స్టాంప్ డ్యూటీ- తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని ఈ రెండు అంశాలపై గౌరవ ముఖ్యమంత్రితో చర్చించి విధివిధానాలపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పరామర్శించిన శ్రేణులు

- సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటే నేతల వేడుకోలు



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ను ఉమ్మడి మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, రావుల చంద్రశేఖర్ రెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ లో గులాబి అధినేత కేసీఆర్ ను పరామర్శించారు. శనివారం హైదరాబాద్ లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ను పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయురారోగ్యాలతో పాటు నిండు నూరేళ్లు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని నేతలు ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగనికై సిద్ధమైన కెసిఆర్ ఆరోగ్యంగా ఉండాలని భగవంతుని వేడుకున్నట్లు నేతలు పేర్కొన్నారు.

## శంకర్పల్లి మున్సిపల్‌లో పీర్ల దగ్గరికి వెళ్లి దర్శనం చేసుకున్నా నాయకులు



**తెలుగు వెలుగు జూలై 5:** రేపు మొహరం సందర్భంగా శంకర్ పల్లి మునిసిపల్ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్డు లో ఉన్న దర్గా దగ్గర పీర్ల పండుగ ఆదివారం జరుపుకుంటున్న ప్రజలకు మంచి జరగాలని కోరుకున్నారు ఈ సందర్భంగా స్థానిక ముస్లిం సోదరులు వీరికి శాలువలతో సన్మానం చేశారు శంకర్ పల్లి మాజీ ఉప సర్పంచ్ సాత ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు గోపాల్ రెడ్డి దర్శించుకున్నారు.

## శంశిగుడా దర్గాలో ఘనంగా పీర్ల పండగ...

- ప్రత్యేక ప్రార్థనలు చేసిన కార్పొరేటర్ దొడ్ల...



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంషిగుడా లో ఉన్న దర్గాలో గౌస్ అశ్వర్యంలో నిర్వహించిన పీర్ల పండుగ శనివారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై పీర్ల దేవుళ్ల ప్రతిమలను పూజించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉండే ముస్లిలందరూ రంజాన్, బక్రీద్ తర్వాత జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో మొహర్రం(పీర్ల పండుగ) ఒకటి అని అన్నారు. డివిజన్ ప్రజలందరూ కులమతాలకి అతీతంగా అన్ని పండుగలు ఆనందంగా జరుపుకోవాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, ఇమ్రాన్, పద్మారావు, సుబాబా, కళ్యాణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చెయ్యాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ




**వికారాబాద్ జిల్లా ప్రతినిధి జులై 5 తెలుగు వెలుగు** :వికారాబాద్ జిల్లా కేంద్రంలో స్కాలర్ షిప్స్ ,ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని నిరసన తెలియచేయడం జరిగింది అనంతరం ఎస్ ఎఫ్ ఐ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ మాట్లాడుతూ గత 6 ఏళ్లుగా రాష్ట్రం లో ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయలేదు దాదాపు 8400 కోట్ల రూపాయల కు పైగా పెండింగ్ లో ఉన్నాయి ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చెయ్యక పోవడం వల్ల విద్యార్థులు ఇంటర్ ,డిగ్రీ,బిటెక్,ఎమ్ బి బి ఎస్ నర్సింగ్ చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు తమ విద్యను పూర్తి చేసుకొని ఉన్నత విద్య కు వెళ్లాలంటే సర్టిఫికెట్స్ కచ్చితంగా అవసరం కాబట్టి ప్రైవేట్ కళాశాలలు ఫీజు రీయింబర్స్మెంట్ రాలేదు కాబట్టి కాలేజీ ఫీజు మొత్తం కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తున్నారు దీని వల్ల పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు ,గతం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేస్తామని బహిరంగాగా ప్రకటించి ఏడాది గడుస్తున్న విడుదల చేయని దుస్థితి నెలకొంది , ప్రభుత్వాలు మారిన పాలన మార దం లేదు , ప్రభుత్వం అధికారులు స్పందించి పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చెయ్యాలని లేదంటే ఎస్ ఎఫ్ ఐ గా మేము విద్యార్థులతో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించడం జరిగింది ఎస్ ఎఫ్ ఐ జిల్లా సహా య కార్యదర్శి అనిల్ జిల్లా కమిటీ సభ్యులు అభిషేక్,సిద్దార్థ తదితర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


## డ్రగ్స్ గంజాయి మత్తు పదార్థాలకు యువత బానిస కావద్దు

- పివైఎల్ రాష్ట్ర కోశాధికారి వాసం బుచ్చిరాజు




**తెలుగు వెలుగు ప్రతినిధి, (అశ్వారావుపేట):** యువత డ్రగ్స్ గంజాయి మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని పివైఎల్ రాష్ట్ర కోశాధికారి వాసం బుచ్చిరాజు పేర్కొన్నారు. శనివారం మండలంలోని దురదపాడు గ్రామంలో ప్రగతిశీల యువజన సంఘం పాల్వంచ డివిజన్ జనరల్ కౌన్సిలింగ్ సభలో బుచ్చిరాజు యువతను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు వారి వైఫల్యాలను ప్రశ్నించకుండా యువతకు డ్రగ్స్ గంజాయి ఇతర మత్తు పదార్థాలకు యువతను బానిసలు చేస్తున్నారని ప్రభుత్వాలను విమర్శించారు. దేశంలో కోట్లాదిమంది యువకులు ఉపాధి లేక రోడ్లపై తిరుగుతున్నారని యువతకు ఉపాధి అవకాశాల కోసం యువత ఉద్యమించాలని వారు అన్నారు. పి వై ఎల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కోర్స రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు నిరుద్యోగులకు రూ.4వేలు భృతి చెల్లిస్తామని చెప్పి చెల్లించకుండా కాలయాపన చేస్తుందని ప్రభుత్వాన్ని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, ఉద్యోగ భర్తీలో నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. ఉద్యోగ క్యాలెండరు ప్రకటించినా ఉద్యోగాలు మాత్రం భర్తీ చేయడం లేదన్నారు. కనీసం నిరుద్యోగ భృతి పై క్లారిటీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం సంఘ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి నుప భాస్కర్, పద్దం లక్ష్మణ్ రావు, బాడిస లక్ష్మణరావు, ఈసం అశోక్, కారం మల్లేష్, ఊకే మహేష్, ఓరుగంటి శ్రీను, భూలక్ష్మి, పండ ముత్యాలు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ బరిలో బొంతు రాంమోహన్



**తెలుగు వెలుగు:** త్వరలో జరుగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున మాజీ మేయర్,పీసీసీ ఉపాధ్యక్షుడు బొంతు రాంమోహన్ పేరు అన్యుహంగా ప్రచారంలోకి వచ్చింది. మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఈ స్థానానికి ఖాళీ ఏర్పడటంతో ఉప ఎన్నిక అనివార్యం అయింది.గతంలో గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గా పనిచేయటంతో అందరితో సత్సంబంధాలు ఉండటం,ప్రజలకు కూడా పేరు సుపరిచితం కావటంతో కాంగ్రెస్ అధిష్టానం మాజీ మేయర్ వైపు దృష్టి సారించినట్లు తెలుస్తుంది. గతంలో మేయర్ గా పనిచేసినప్పటి నుండి ఇదే నియోజకవర్గ పరిధిలో నివాసం ఉండటం కూడా కలిసి వస్తుంది.తాజాగా శనివారం నాడు తన జన్మదినాన్ని సైతం నియోజకవర్గ పరిధిలో నిర్వహించడంతో ఈ ప్రచారానికి బలం చేకూరుస్తుంది.గతంలో పోటీ చేసిన మాజీ భారత క్రికెట్ క్యాప్టెన్ అజారుద్దీన్ విషయంలో ఈ నియోజకవర్గములో బలంగా ఉన్న ఓ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుండటం కూడా రామ్మోహన్ అభ్యర్థిత్వంపై పార్టీ దృష్టి పెట్టినట్లు ప్రచారంలో ఉంది.ఏది ఏమైనా బీసీ సామాజిక వర్గానికి టికెట్ ఇచ్చి కాంగ్రెస్ మరో మారు తమ పార్టీకి బీసీ ల పట్ల ఉన్న ప్రేమను చాటడానికి ఒక అవకాశంగా ఉపయోగించవచ్చని పావులు కదుపుతున్నట్లు,దాంతో స్థానిక ఎన్నికల్లో కూడా ప్రభావితం చేయవచ్చని భావిస్తుందని సమాచారం.ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేతగా రాజకీయ రంగ ప్రవేశం చేసి చర్లపల్లి నుండి కార్పొరేటర్ గా గెలిచి అన్యుహంగా మేయర్ పదవి వరించటం,ఆ తర్వాత కాంగ్రెస్ లో చేరి పీసీసీ లో కీలక బాధ్యతలు ఇవ్వటంతో ఎమ్మెల్యే టికెట్ రేసులో బొంతు కీలకంగా మరనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

## గంజాయి విక్రయాలకు "కార్మికులే" టార్గెట్..!

- షాద్ నగర్ నియోజకవర్గంలో ఎక్సైజ్ పోలీసుల దాడులు
- పోలీసుల అదుపులో గంజాయి విక్రయ నిర్వాహకుడు
- ఎక్సైజ్ పోలీసుల చేతికి చిక్కిన గంజాయి చాక్లెట్లు
- గంజాయి విలువ 3.5 లక్షలు
- షాద్ నగర్ మీడియా సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఉజ్వల రెడ్డి వెల్లడి



**షాద్ నగర్:** వలస కార్మికులే టార్గెట్ గా ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని గంజాయి కి బానిసలను చేస్తూ పరిశ్రమలలో కార్మికులుగా పనిచేయడానికి వచ్చిన వ్యక్తులకు ఇబ్బడి ముబ్బడిగా గంజాయి అమ్ముతున్న అక్రమ వ్యాపారిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించి లక్షలాది రూపాయల విలువైన గంజాయిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు రంగారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అధికారి ఉజ్వల రెడ్డి వివరించారు. షాద్ నగర్ ఎక్సైజ్ పోలీసు శాఖా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఉజ్వల రెడ్డి మాట్లాడుతూ.. ఇక్కడ పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికులుగా నివసిస్తున్న వారికి గంజాయి వికరించేందుకు నందిగామ సమీపంలోని అయ్యప్ప స్వామి టెంపుల్ వద్ద ఒక చిన్న హోటల్ మరియు కిరాణం వ్యాపారం నిర్వహిస్తూ బీహార్ రాష్ట్రానికి చెందిన పింటూ సింగ్ అనే వ్యక్తి ఉత్తర భారత దేశంలోని కొన్ని రాష్ట్రాల నుండి గంజాయిని తీసుకువచ్చి గుట్టు చప్పుడు కాకుండా పలు కంపెనీలలో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులకు వాటిని అమ్ముతున్నట్లు పేర్కొన్నారు. వారం రోజులు పాటు నిఘా ఉంచి శనివారం సదరు వ్యక్తిని పట్టుకొని నిందితుని వద్ద 2.250 కిలో గ్రాముల ఎండు గంజాయి, 9.13 కిలోగ్రాముల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయి మరియు గంజాయి చాక్లెట్ల విలువ సుమారు 3.5 లక్షల వరకు ఉంటుందని ఆమె తెలిపారు. అరెస్టు చేసిన నిందితుని పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని, విచారణ అనంతరం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ఎక్సైజ్ దాడుల్లో నందిగామ ఏరియా ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సునీత, షాద్ నగర్ ఏరియా ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్, ఎక్సైజ్ పోలీసులు రవి, సుధీర్, వినోద్, రాజయ్య, రోహిత్ తదితరులు పాల్గొన్నారు

## ముగిసిన కొబ్బరి ఉప ఉత్పత్తులతో శిక్షణ




**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట:** స్థానిక వ్యవసాయ కళాశాలలో కొబ్బరి అభివృద్ధి బోర్డు, విజయవాడ కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన కొబ్బరి హస్తకళ నైపుణ్య అభివృద్ధి కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎడిఎ రవికుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ మహిళలు, యువతి యువకులు ఎంతో ఆసక్తిగా కొబ్బరి చిప్పలతో తయారు చేసినటువంటి అలంకరణ వస్తువులను చూసి సంతోషిస్తూ వ్యర్థాలకు అర్థాన్ని ఇచ్చారని అన్నారు. ఔత్సాహిక యువత ఇటువంటి నైపుణ్యాలను నేర్చుకొని స్వయంగా ఎదగాలని, ఇప్పుడు మార్కెట్‌లో ఇటువంటి నూతన వస్తువులకు, పర్యావరణ మేలు కల్పించే ఇటువంటి ఆలోచన ఎంతో అభినందనీయం అన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కొబ్బరి చిప్పల నుండి వచ్చేటువంటి వ్యర్థాలను వృధా చేయకుండా వాటికి విలువ జోడిరచి అందమైన పూల కుండీలు, టీ కప్స్, కిడ్డీ బ్యాంక్స్, ఇయర్ రింగ్స్, జడ క్లిప్పులు, టీ స్పూన్స్, మ్యూజికల్ ఇంస్ట్రుమెంట్స్, ఫోటో ఫ్రేమ్, కుంకుమ భరిణలు, తాబేలు బొమ్మ, చిన్న పిల్లలకు ఆట బొమ్మలు, మొదలైనవి తయారుచేసిన శిక్షకులందరికీ అభినందనలు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను ఇక్కడ శిక్షణ పొందిన ట్రైనీలు అందరు భవిష్యత్తులో ఒక గ్రూపు గా అయ్యి ఇలాంటి వాటిని కొత్తగా తయారు చేసె పరిశ్రమ స్థాపించే స్థాయిక ఎదగాలని ప్రోత్సహించారు.

## తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ కేంద్ర సంఘ రాష్ట్రస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం...






**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ కేంద్ర సంఘ రాష్ట్రస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మన్య బోయిన కృష్ణ యాదవ్ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, కార్యవర్గ సభ్యులు వెంకటరమణ.ఏంజులా రెడ్డి శ్రవణ్ కుమార్ గౌడ్. తదితరులు పాల్గొని కేంద్ర సంఘం ప్రవేశపెట్ట తీర్మానాలు అన్నిటిని కూడా ఏకభవిస్తూ జిల్లాలో పనిచేస్తున్న జెడి క్యాడర్ డిడి క్యాడర్ ఎడి క్యాడర్ ఉన్న అధికారులకు రాబోయే రోజుల్లో కంఫర్ట్ ఐఏఎస్ నాన్ రెవెన్యూ కోటాలో వచ్చే విధంగా ప్రయత్నం చేయాలని కేంద్ర సంఘం అధ్యక్షులు ఏలూరు శ్రీనివాస్ కి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణతెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ కేంద్ర సంఘ రాష్ట్రస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ కి వినతిపత్రం ఇస్తూ కోరారు.



# పరిశ్రమల వల్ల ప్రజా ప్రయోజనం ఏమిటి..

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ప్రమాణాల గురించి ఎందుకు పట్టించుకోరు..
- కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారా..
- తనిఖీలు ముమ్మరం చేయండి.. పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించండి..
- నేను ఎవరిపైనా రాజకీయ ఒత్తిడి తేను..
- మీరు డబ్బులకు ఆశ పడకండి..
- కాలుష్య రహిత షాద్ నగర్ కు సహకరించండి..
- పారిశ్రామిక అధికారులతో షాద్ నగర్ ఎమ్మెల్యే సమీక్ష సమావేశం..



**షాద్ నగర్ :** పరిశ్రమలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి.. పొట్ట చేత పట్టుకొని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల బతుకులను బలి చేస్తున్నాయి.. మరోవైపు పరిసర గ్రామాల రైతు రైతాంగం కాలుష్య సమస్యలతో తల్లడిల్లుతున్నారు.. పచ్చని పంటలను నష్టపోతున్నారు.. ఇలాంటి నష్టాలు జరుగుతున్నప్పుడు పరిశ్రమలు ఉండి ప్రయోజనం ఏమిటి.. ఇకనైనా ముందుకు కదలండి.. తనిఖీల ద్వారా పరిశ్రమలు ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోండి.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులకు సూచించారు. షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరిశ్రమల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పరిశ్రమల జనరల్ మేనేజర్ యాదయ్య, కాలుష్య నివారణ మండలి ఏఈ షజీనా, పరిశ్రమల ఇన్స్పెక్టర్ జంగయ్య తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పలు అంశాలపై మాట్లాడారు. షాద్ నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా 370 పరిశ్రమలు ఉన్నాయని నియోజకవర్గంలో 124 ప్రమాదకరమైన పెద్ద పరిశ్రమలు, 65 చిన్న ప్రమాదాలకు ఆస్కారం ఉండే పరిశ్రమలు ఉన్నాయని తెలుసుకున్నారు. అదేవిధంగా 181 సాధారణ పరిశ్రమలు ఉన్నాయని అధికారులు వివరించారు. కాగా తరచు పరిశ్రమలలో భారీ ప్రమాదాలు జరగడం కార్మికులు మృత్యువాత పడటం జరుగుతున్న అంశంపై ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ఆయన పేర్కొన్నారు. గతంలో స్టీమ్ కోర్, సౌత్ గ్లాస్ కంపెనీ, వినాయక స్టీల్, ఇంకా అనేక మండలంలో ఉన్న ప్రమాదకర పరిశ్రమల్లో ఫెర్నస్ పేలి ఎంతోమంది మృత్యువాత పడ్డారని గుర్తు చేశారు. ఆయా పరిశ్రమల యాజమాన్యాల నిర్వహణ నిర్లక్ష్యం దీనికి కారణమని ఇలాంటి సమయాల్లో అధికారులు తనిఖీలు చేసి ఉంటే ఇలాంటి ప్రమాదాలు చేసుకునేవి కావాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. **ఎమ్మెల్యే ఏమన్నారంటే..** పరిశ్రమలు ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిపై మీరు ఎందుకు స్పందించడం లేదు.. ఇకనైనా స్పందించండి. నేను ఎలాంటి ఒత్తిడికి లొంగను.. మీరు కూడా డబ్బులకు ఆశపడకండి. ప్రజలు చనిపోతున్నారు.. మానవత్వంతో ఆలోచించండి.. పరిశ్రమలు ప్రమాదరహితంగా ఉండేలా చర్యలు తీసుకోండి. ఇన్ని పరిశ్రమలు ఉన్నప్పటికీ ఒక్కసారి కూడా తనిఖీ జరిగినట్లు రుజువులు లేవు. అసలు మీరు ఉన్నారా.. లేరా.. అర్థం కాని పరిస్థితి ఉంది. ప్రజల్లో కూడా ఇదే భావన కనిపిస్తుంది. ఇకనైనా మారండి. కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు. ఇలాగే వదిలేస్తే ఎన్నో జీవితాలు కాలగర్భంలో కలిసిపోతాయి. ఈ ప్రమాదాల పరంపరకు ఇకనైనా చరమగీతం పాడుదాం.లినేను డబ్బులు తినేవాడిని కాదు తప్పులు చేసే యాజమాన్యాన్ని వదిలేసే ప్రసక్తి ఉండదు.. మీరు కూడా చిత్తశుద్ధితో నిబద్ధతగా ఉండండి ఎవరైనా రాజకీయ నాయకులు నా పేరు చెప్పి ఒత్తిడి తీసుకువచ్చిన తన దృష్టికి తీసుకురావాలని ఎవరికి ఏ లాలూచీ అవసరం లేదని ఎమ్మెల్యే శంకర్ తేల్చి చెప్పారు..

## టీజేఏసీ నాయకులు గుట్ట శంకర్ గుప్తాను పరామర్శించిన మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్...



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** తెలంగాణ ఉద్యమ నేత జగదిరిగుట్ట ప్రాంతానికి చెందిన గుట్ట శంకర్ గుప్తా ఇటీవల గుండెకు సంబంధించి బైపాస్ సర్జరీ చేసుకున్నారు. అయితే విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ శనివారం జగద్గిరిగుట్టలోని గుట్ట శంకర్ నివాసం వద్దకు వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా శంకర్ ఆరోగ్య స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక నాయకులు దుంబాల శ్రీనివాస్ రెడ్డి, వేముల ఆంజనేయులు, శంకర్ గౌడ్, అంజిరెడ్డి, వాసు, జయకృష్ణ, అఖిల్, నర్సింగ్ గౌడ్, రవీంద్ర చారి, సోమయ్య గుప్తా, లక్ష్మణ్, బాలా చారి, సోమేశ్వర్ గుప్తా, చంద్రమౌళి, బోర్వెల్ రాము తదితరులు పాల్గొన్నారు.

## కూకట్పల్లి కాపు సంఘం అధ్యక్షులుగా పిఎస్ఆర్కే భగవాన్ ఏకగ్రీవ ఎన్నిక...



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** కూకట్పల్లి నియోజకవర్గం కాపు సంఘం నూతన అధ్యక్షులుగా ప్రముఖ పారిశ్రామికవేత్త, భగవాన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పీఎస్ఆర్కే భగవాన్ నియమితులయ్యారు. అలాగే ఉపాధ్య క్షులుగా బచ్చు నాగమల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా అడబాల నరేష్, కోశాధికారిగా కొత్తపల్లి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శిగా పిల్ల నారాయణరావు, కార్యవర్గ సభ్యులుగా పోతురాజు, వెంకట సుభాష్, వలవల నాయుడు తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా భగవాన్ మాట్లాడుతూ కూకట్పల్లి నియోజకవర్గం లో కాపు సంఘం అభివృద్ధికి సాయి శక్తుల కృషి చేస్తానని తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయనని హామీ ఇచ్చారు.

## కూకట్పల్లి నుండి సామాజిక న్యాయ సమర భేరికి భారీగా తరలి వెల్లిన కాంగ్రెస్ శ్రేణులు...

- కాంగ్రెస్ సభకు తరలివచ్చిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపిన బండి రమేష్



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సెల్ఫీ స్టేడియంలో జరిగిన సామాజిక న్యాయ సమర్భేరి కార్యక్రమానికి కూకట్పల్లి నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ పేర్కొన్నారు. ఏఐసిసి పిలుపుమేరకు శుక్రవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశానికి కూకట్పల్లి నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. టిపిసిసి ఉపాధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో 25 బస్సులు ఏర్పాటు చేయగా సుమారు 2వేల మంది కి పైగా పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఉత్సాహంగా తరలి వెళ్లి సభలో పాల్గొన్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఎఐసిసి పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరయ్యారు. ఈ సభలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు బండి రమేష్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

## ఆల్విన్ కాలనీలోని మహంకాళి నగర్‌లో మురుగునీటి ప్రవాహాన్ని అరికట్టండి...

- కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సింగ్ యాదవ్



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** ఆల్విన్ కాలనీలోని మహంకాళి నగర్ లో మురుగునీటి ప్రవాహాన్ని అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింగ్ యాదవ్ పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ మహంకాళి నగర దగ్గర ఉన్న ఎల్లమ్మ చెరువులో పెద్ద పైపులు వేసిన తరుణంలో పాత పైపులు డ్యామేజ్ కావటంతో వాటరు కాలనీలోకి ప్రవేశించి ఇబ్బంది పడుతూ ప్రజలు కంటెస్టెడ్ కార్పోరేటర్ నర్సింగ్ యాదవ్ కి సమస్యను పరిష్కరించమని కోరగా అక్కడ విధులు నిర్వర్తిస్తున్న హైడ్రా అధికారులను నర్సింగ్ యాదవ్ కలిసి సమస్య త్వరగా పరిష్కరించాలని కోరారు. నాయకులు ఆంజనేయులు యాదవ్, వెంకటస్వామి రెడ్డి, రాయల్, ఆశంగారి సురేష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు

## వాటర్ ట్యాంక్, బిటి రోడ్డుకి నల్లమిల్లి శంకుస్థాపన



**తెలుగు వెలుగు తూ.గో. జిల్లా బ్యూరో (అనపర్తి):** జలజీవన్ మిషన్ పథకం ద్వారా బిక్కవోలు మండలం ఆరికరేవులలో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించే ఓ హెచ్ ఎస్ ఆర్ వాటర్ ట్యాంక్, తాగునీటి కొళాయిలు, పైప్ లైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. శనివారం ఆరికరేవుల నుండి కొంకుదురు వరకు రూ.70 లక్షల వ్యయంతో నిర్మించే బీటి రోడ్డుకు నల్లమిల్లి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ డి ఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై దాడి ఆరుగురు వ్యక్తులు అరెస్ట్

**తెలుగు - వెలుగు, తూ.గో. జిల్లా బ్యూరో (అనపర్తి):** పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు.శనివారం అనపర్తి మండలం కుతుకులూరు శివారులో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందంగా దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు.వారి వద్ద నుండి రూ.42 వేల 420 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీను నాయక్ చెప్పారు.

## పెదపూడి గ్రామసభలో ప్రగతి నివేదిక



**తెలుగు - వెలుగు,తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి):** తక్కువ ఆదాయం ఉన్న పెదపూడి పంచాయతీ పొదుపుగా ఎటువంటి వృధా ఖర్చు లేకుండా పాలన సాగిస్తుందని డిప్యూటీ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణ రెడ్డి అన్నారు. శనివారం పెదపూడి పంచాయతీ ఆవరణలో సర్పంచ్ కలవల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ ఆదాయ వనరులపై పన్నులు పెంచుకోవాలని అందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.తడి పొడి చెత్త విడివిడిగా ఇస్తే తడి చెత్త వర్మీ కంపోస్ట్, పొడి చెత్త రీసైకిల్ కు ఉపయోగిస్తామని తద్వారా గ్రామ పారిశుధ్యం మెరుగుపడుతుందని డిప్యూటీ ఎంపీడీవో ఎమ్ఎస్ఎన్ రెడ్డి తెలిపారు. అన్ని డిపార్ట్మెంట్స్ కు చెందిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. త్రాగునీరు పంచాయతీ ఎంతో ప్రయాసలు కోర్చి ఇవ్వడం జరుగుతుందని నీటిని వృధా చేయరాదని గ్రామ సభలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్సి చైర్మన్ అమ్మన్న చౌదరి, పుట్టా గంగాధర చౌదరి, నీటి సంఘాల అధ్యక్షులు ఆరుమెల్లి వాసు, జనసేన రవి, సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీలు, రైతులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## రామవరంలో "సుపరిపాలనలో తొలి అడుగు"

**తెలుగు - వెలుగు,తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి):**అనపర్తి మండలం రామవరంలో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం ప్రారంభించి కూటమి ఏర్పడిన తర్వాత అనపర్తి మండలం రామవరం లో రూ.12 కోట్ల 65 లక్షలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయని వివరించారు.నియోజకవర్గ వ్యాప్తంగా రూ.160.3 కోట్ల మూడు లక్షలు, రైల్వే శాఖ నుండి 292 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వ హించగా వెరసి 452.2 కోట్లు అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి ఇంటింటికి కర్ర పత్రాలనుఅందించి వివరించారు.ఎన్డిఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆలేరు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపిక

**యాదాద్రి జూలై 05:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సుమయ్య బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపిక అయినట్లు పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు దాసరి మంజుల తెలిపారు.నిన్న విడుదల చేసిన ఫలితాల్లో ఆమె ఎంపిక అయినట్లు తెలిసిందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ,ఉపాధ్యాయులు సుమయ్యని సత్కరించారు.ప్రధానోపాధ్యాయురాలు రెండు వేల రూపాయల నగదు పురస్కారం అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లి, సోదరుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొ న్నారు. ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహంతో ఈ సీటు సాధించ గలిగానని సుమయ్య అన్నారు. 2024- 25 విద్యా సంవత్సరంలో 542 మార్కులు సాధించి పాఠశాల ప్రథమంగా నిలిచింది.



తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
ఆదివారం,
06 జులై 2025



# షాద్‌నగర్‌ను "షాన్ దార్ నగర్"గా మారుస్తా..!

- షాద్‌నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"
- మొత్తం "ఆరు వార్డుల్లో" రూ. 21కోట్ల 58 లక్షల 75 వేలతో అభివృద్ధి
- షాద్‌నగర్ మున్సిపాలిటీలో అభివృద్ధిని నిరంతరం కొనసాగిస్తాం
- "ఎమ్మెల్యే" సుడిగాలి పర్యటనతో సుడి తిరిగిన పట్టణ అభివృద్ధి
- కన్నుల పండుగగా సాగిన శంకుస్థాపనల కార్యక్రమం
- కాంగ్రెస్ సైన్యంతో "బుల్లెట్ బైకు"పై ఎమ్మెల్యే శంకర్ పర్యటనలు
- మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి ఆధ్వర్యంలో శంకుస్థాపనల ఏర్పాట్లు
- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కోసం హాజరైన బస్తీ వాసులు



**షాద్ నగర్ :** షాద్ నగర్ పట్టణాన్ని షాన్ దార్ నగర్ గా మారుస్తానని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కోసం బస్తివాసులు శంకుస్థాపనలకు తరలిరావడం హర్షించదగ్గ పరిణామం అని పట్టణంలో నూతన ఒరవడి మొదలైందని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ "వీర్లపల్లి శంకర్" అన్నారు.శనివారం షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరు వార్డుల్లో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ "వీర్లపల్లి శంకర్" సుడిగాలి పర్యటన ద్వారా అనేక వార్డుల్లో మొత్తం "ఆరు వార్డుల్లో" రూ. 21కోట్ల 58 లక్షల 75 వేలతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది అనేక వార్డులో వివిధ కార్యక్రమాలలో భాగంగా సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు ఇతర పనులకు ఎమ్మెల్యే శంకర్ లాంచనంగా శంకుస్థాపన చేశారు. ఆయా వార్డుల్లో పార్టీలకు అతీతంగా ప్రజలు ఈ కార్యక్రమాల కోసం బస్తీ వాసులు తరలిరావడం పట్ల ఎమ్మెల్యే శంకర్ ఆనందం వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా స్పందించిన నాడే ఆయా వార్డులు అభివృద్ధి చెందుతాయని పట్టణం మొత్తం సుందరీకరణ జరుగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని మూడోవాడు చటాన్ పల్లిలో మొదట సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా 21 వ వార్డులో సిసి రోడ్డు పనులు, ఆరో వార్డులో టీచర్స్ కాలనీ మరియు సాయిబాబా కాలనీలో సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పట్టణంలోని ఏడో వార్డులో సిసి రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తొమ్మిదో



వార్డులో భగీరథ కాలనీ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు మరియు జిహెచ్ఆర్ పార్క్ అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా 10వ వార్డులో పరిగి రోడ్డు నుంచి సీఎస్కే వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులకు పెద్ద ఎత్తున శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక నేత సయ్యద్ ఇబ్రహీం తదితర సీఎస్కే సంక్షేమ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే కార్యక్రమానికి సయ్యద్ ఇబ్రహీం స్థానికులు తరలిరావడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. **గతంలో నాణ్యతలేని పనులు..**గత ప్రభుత్వం పట్టణంలో నాణ్యతలేని పనులు చేపట్టి అనేక ముఖ్యమైన కాలనీలో సిసి రోడ్లు తెల్లబోయాయని ఎమ్మెల్యే శంకర్ విమర్శించారు. ఒక మాస్టర్ ప్లాన్ సరిగ్గా లేక ఇంజనీరింగ్ వ్యవస్థ సరైన నిర్ణయాలు తీసుకోలేక సిసి రోడ్లు గుంతల మయమయ్యాయని, రాళ్లు తేలిపోయాయని విచారం వ్యక్తం చేశారు. గత కాంట్రాక్టర్ల పనితీరు ఆనాటి పాలకుల లాభపక్ష తదితర అంశాలతో అభివృద్ధి పనులు పట్టణం లో నాణ్యత లేకుండా జరిగాయని ఎమ్మెల్యే శంకర్ ఆరోపించారు.

పార్కులు సిసి రోడ్డు అంతర్గత మురుగు కాలువలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని రాజకీయాల్లో కొతీతంగా ప్రజలు మెచ్చిన విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. **నీ బుల్లెట్టు బండి ఎక్కి వచ్చేస్తారో..** నీ బుల్లెట్టు బండి ఎక్కి వచ్చేస్తారో.. అన్నట్టు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన వాహనాన్ని వదిలి మున్సిపల్ పట్టణంలో కార్యకర్తల బుల్లెట్టు బైకులపై అభివృద్ధి పనుల కోసం పర్యటించారు. అందే మోహన్, శ్రీశైలం గౌడ్, పులిమామిడి రాజేష్ తదితర బుల్లెట్ వాహనాలపై ఎమ్మెల్యే ఆరు వార్డులలో పర్యటించారు. యువ కార్యకర్తలతో మమేకమై ఎమ్మెల్యే శంకర్ కళ్ళజోడు పెట్టుకుని కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ముందుకు సాగారు. ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేసిన ప్రతి కాలనీలలో స్థానికులు బ్యాండ్ బాజా, టపాసుల మోతలతో కార్యక్రమాలను రక్తి కట్టించారు. భారీ స్వాగత సత్కారాలతో ఎమ్మెల్యే శంకర్ పర్యటనలు జరిగారు.. అదేవిధంగా ఆయా కాలనీలలో బస్తీ పెద్దలతో వారి స్వగృహాలకు వెళ్లి ఎమ్మెల్యే కాసేపు తేనీటి విందు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, అదేవిధంగా సీనియర్ నాయకులు సయ్యద్ ఇబ్రహీం, జమ్రుద్ ఖాన్, సర్వర్ పాషా, శ్రావణి, సీఎస్కే శ్రీనివాస్ రెడ్డి, రమాదేవి, జాకీరుద్దీన్, ముబారక్, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, ఇబ్రహీం, లింగారెడ్డి గూడా అశోక్, పార్టీకి చెందిన పలు విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



# "యువనేత" పేరు ఎత్తితే మీకెందుకు ఉలుకు..

- గుమ్మడికాయల దొంగ అన్నట్టు "షాద్ నగర్ బిఆర్ఎస్" యవ్వారం
- మీ అరాచకాల వెనకున్నోడి ముసుగును తొలగిస్తాం..!
- మా వ్యక్తిగత సంభాషణ విన్నోడు తెలిస్తే బట్టలూడదీసి కొడతాం
- షాద్ నగర్ ఎమ్మెల్యేకే.. మీ అల్టిమేటమా..
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సిగ్గులేకుండా మమ్మల్ని బెదిరిస్తారా..







**షాద్ నగర్ :**మీడియా సమావేశం పెట్టి ఎమ్మెల్యేకు వార్నింగ్ ఇచ్చిన బిఆర్ఎస్ నేతలపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్లు షాద్ నగర్ బిఆర్ఎస్ నాయకుల వాళ్ళకం చూస్తుంటే తమకు అనేక అనుమానాలు కలుగుతున్నాయని, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో షాద్ నగర్ కాంగ్రెస్ నాయకుల ట్యాపింగ్ వెనుక ఉన్న యువ నాయకుడు ఎవరో సదరు ప్రెస్ మీట్ పెట్టిన నాయకులే పోలీసులకు ఆచూకీ చెప్పాలని లేకపోతే చట్ట ప్రకారం ఆ నాయకుడి అరాచకాల అంతు తెలుస్తామని షాద్ నగర్ కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ నాయకులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కాంగ్రెస్ ఆదివాసి రాష్ట్ర కోఆర్డినేటర్ పి. రఘునాయక్, కొత్తూరు మండల అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, ఓబీసీ సెల్ తాలూకా చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గిరిజన ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్ మాట్లాడుతూ..జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఎసిపి వెంకటగిరి నుండి తనకు సమాచారం వచ్చిందని తన ఫోన్ టాపింగ్ జరిగినట్టు పేర్కొన్నారని తన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో త్వరలో విచారణకు హాజరు కాబోతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇటీవల షాద్ నగర్ బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు మన్నె నారాయణ యాదవ్, లక్ష్మణ్ నాయక్, పిల్లి శేఖర్, గుండు అశోక్, శీలం శ్రీకాంత్, జూపల్లి శంకర్, సంజు నాయక్ తదితరులు యువనేతను విమర్శించారని ఆరోపిస్తూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ 48 గంటలలోపు సమాధానం చెప్పకపోతే న్యాయ విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని పరిణామాలు తీవ్రంగా ఉంటాయని సాక్షాత్తు ఎమ్మెల్యేని బెదిరించడాన్ని బట్టి చూస్తే ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రెస్ మీట్ పెట్టిన నాయకులకు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఆ యువ నాయకుడు ఎవరో తెలిస్తే పోలీసులకు చెప్పాలని లేకపోతే చట్టపరంగా వీరిపై చర్య తీసుకోవడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు ఎగిరేసినట్టు ఎవరి పేరు ఉచ్చరించకుండా ఏ పార్టీ పేరు చెప్పకుండా యువ నాయకుడు మా ఫోన్లు టాపింగ్ చేసినట్లు మాకు అనుమానాలు ఉన్నాయని చెప్పగానే టిఆర్ఎస్ నాయకులు వెంటనే మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యేకే వార్నింగ్ ఇవ్వడం వెనుక కుట్ర చేసింది ఎవరో చెప్పాలని రఘునాయక్ డిమాండ్ చేశారు. **బట్టలూడదీస్తాం.. బజారులో తిప్పుతాం..**షాద్ నగర్ లో తన ఫోనుతోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన కృష్ణారెడ్డి, జమ్రుద్ ఖాన్, శ్రావణి తదితరుల ఫోన్లు ట్యాపింగ్ చేసిన వెధవలు ఎవరో త్వరలోనే చట్ట ప్రకారం తేల్చుకుంటామని తమకు కొన్ని అనుమానాలు ఉన్నాయని రఘునాయక్ తీవ్రంగా స్పందించారు. వ్యక్తిగత సంభాషణలు విన్న వాళ్లకు ఏ అధికారం ఉందని తమ ఫోన్లను ట్యాపింగ్ చేశారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన ఎవరైనా సరే తమకు వారి ఆచూకీ తెలిస్తే వాళ్ల బట్టలు ఊడదీసి బజారులో ఊరేగిస్తామని ఘాటుగా విమర్శలు గుప్పించారు. ఏలాంటి అర్థంపర్థం లేకుండా తమ ఎమ్మెల్యేను 48 గంటల్లో వివరణ ఇవ్వాలని వార్నింగ్ ఇచ్చిన సదరు బిఆర్ఎస్ నాయకుల పై పోలీస్ స్టేషన్లో లిఖితపూర్వక ఫిర్యాదు చేయబోతున్నట్లు రఘు ప్రకటించారు. అధికారం ఉంది కదా అని విచ్చలవిడిగా ప్రజల జీవితాలతో చెలగాటమాడిన అరాచక శక్తుల ఆట కట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. **మీడియాపై కుట్రలు సహించం** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తామిచ్చిన ప్రెస్ స్టేట్మెంట్లను విడుదల చేసిన మీడియా ప్రతినిధులపై కక్ష కట్టి వ్యక్తిగత నోటీసులు పంపించడం సిగ్గుచేటని రఘునాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లు మీడియాపై అక్రమ కేసులు రౌడీషీట్లు పెట్టిన నాయకులు ఇప్పుడు మళ్లీ మీడియా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వాస్తవాలు ప్రజలకు వివరించకుండా భయభ్రాంతులకు గురి చేసే విధంగా ఇల్లీగల్ నోటీసులను జారీ చేస్తుండడం బట్టి చూస్తే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి ఈ నోటీసులు అందజేసిన వారికి కచ్చితంగా సంబంధం ఉందని తమకు అర్థమవుతుందని అన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రఘునాయక్ డిమాండ్ చేశారు. తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనని ముందస్తుగానే బెదిరింపులకు దిగుతున్నారని అందుకు తార్కానమే ఈ సంఘటనలు అని రఘునాయక్ అనుమానం వ్యక్తం చేశారు. మీడియా జోలికి వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని మీడియాకు అండగా నిలబడతామని రఘునాయక్ పేర్కొన్నారు. **బరాబర్ యువ నాయకుడని చెప్తాం - బాబర్** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో యువ నాయకుడి పేరు బరాబర్ చెబుదామని తమకు అనుమానాలు ఉన్నప్పుడు ఎందుకు వదిలిపెడతామని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ పేర్కొన్నారు. యువ నాయకుడు అని చెబితే మీడియాపై దౌర్జన్యం చేయడం, ముందస్తుగానే హెచ్చరికలు ఎమ్మెల్యేకు జారీ చేయడం వంటి ఘటనలు చూస్తుంటే తమకు అనుమానాలు ఎన్నో ఉన్నాయని, బరాబర్ యువ నాయకుడనీ చెబుతామని ఎవరికీ భయపడే ప్రసక్తే లేదని అన్నారు. తనకు కూడా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలు విచారణకు రావాలని సమాచారం వచ్చిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇంకా కెసిఆర్ ప్రభుత్వమే నడుస్తుందన్న భ్రమలో ఇక్కడి నాయకులు బ్రతుకుతున్నారని ఇంకా అరాచకాలకు పాల్పడటం ఏమైనా చేస్తామంటే చూస్తూ ఊరుకోమని తాము కూడా రాజకీయంగా మంచివార్తను ఉండాలని ఉద్దేశంతో ఉన్నామని కానీ ఇలా బెదిరింపులకు హెచ్చరికలకు పాల్పడితే తాము చూస్తూ ఊరుకోమని గట్టిగా సమాధానం చెబుతామని బాబర్ హెచ్చరించారు. బరాబర్ యువ నాయకుడు విషయంలో ఒకే స్టాండ్ పై ఉంటామని పోలీసులకు సదన్ నాయకుడిపై ఫిర్యాదు చేయబోతున్నట్లు తెలిపారు. చిల్లర రాజకీయాలు మనకు కాకపోతే వాళ్లకే నష్టమని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీపై, ఎమ్మెల్యే పై, మీడియాపై ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బెదిరింపులకు దిగుతున్న వారి వెనుక కుట్ర నడిపిస్తున్న అరాచక శక్తి ముసుగు తీసే రోజు దగ్గరపడిందని బాబర్ స్పష్టం చేశారు..

# అంతర్జాతీయ గ్రామీణాభివృద్ధి దినోత్సవాన్ని జయప్రదం చేద్దాం: ఎంపీడీఓ



**బొమ్మనహళ్ జూలై 05:–**అంతర్జాతీయ గ్రామీణాభివృద్ధి దినోత్సవాన్ని, బొమ్మనహల్ మండల పరిధిలోని అన్ని గ్రామాలలో, జయప్రదంచేసుకోవాలని,మండల,ఎంపీడీఓ విజయబాస్కర్,అన్నారు,శనివారం మండల కేంద్రంలోని,మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామి టెక్నికల్,ఫీల్డ్ అసిస్టెంట్లు,వెలుగు,వైద్య,హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు,ఎంపీడీఓ,మాట్లాడుతూ, అంతర్జాతీయ దినోత్సవం సందర్భాంగా నేడు గ్రామ పంచాయతీలలో,గ్రామసభలు నిర్వహించి, గ్రామాణాభివృధి,పై ప్రజలకు వివరించాలని చెప్పారు, గ్రామాలలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, చేసిన అభివృద్ధి పనులుపై చర్చించాలన్నారు,ఈ కార్యక్రమానికి,మండల ప్రజాప్రతినిదులు,అన్ని శాఖలు అధికారులు, సర్పంచ్లు,ఎంపీటీసీలు, సిబ్బంది,ప్రతి ఒక్కరూ పాల్గొని, విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు,ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈఈ వాసంతి, వెలుగు ఎపిఎం,రామకృష్ణ,పంచాయతీ కార్యదర్శులు శివన్న,పకృద్దీన్, అశోక్,పవన్,వివిధ శాఖ అధికారులు,పాల్గొన్నారు,

# కాలం చెల్లిన బస్సులకు, డిపో గ్యారేజీ సిబ్బందితో ముడి పెట్టడం సరికాదు

● ఐదు సమస్యల పరిష్కారం కోసం ఆందోళన



**ఉరవకొండ జులై 05:–** కాలం చెల్లిన బస్సులకు డిపో గ్యారేజీ సిబ్బందిని బలి చేయటం పద్ధతి కాదంటూ శనివారం కార్మికులు ఆందోళన చేపట్టారు. ఐదు సమస్యలు తక్షణమే పరిష్కరించాలంటూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.ఉరవకొండ డిపో నందు స్టేట్ కమిటీ పిలుపు మేరకు నిరసన లో భాగంగాశనివారం రెండవ రోజు అత్యధిక సంఖ్య లో ఉద్యోగులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం న కు రీజనల్ నాయకులు కొండయ్య, డిపో సెక్రటరీ బి.మహబూబ్,డిపో ప్రెసిడెంట్ మురళీ నాయక్, కోశాధికారి శ్రీనివాసులు మరియు సిసిఎస్ డెలిగేట్ పి వి. శ్రీ నివాస్ మరియు గ్యారేజ్ సెక్రెటరీ శ్రీరాములు మరియు సీనియర్ కాలివెంకటేష్ కరూర్ మరియు ట్రాఫిక్ మరియు గ్యారెజ్ ఉద్యోగులు పాల్గొన్నారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు, నినాదాలు చేశారు.

# సుపరిపాలనతో రాష్ట్ర ప్రజలు సురక్షితం: జె.సి.అష్మిత్ రెడ్డి



**యాడికి, జూలై 5 :–** యాడికి మండలంలో తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి.అస్మిత్ రెడ్డి శనివారం యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. కాలనీలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని సమాచారం తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందని వారి వివరాలను నమోదు చేసుకొని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో ముఖ్యంగా డ్రెయిన్, మంచినీటి సమస్యలు స్థానికులు తెలుపగా వెంటనే పరిష్కరించాలని స్థానిక అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఎమ్మెల్యే జె.సి.అస్మిత్ రెడ్డి మొదటగా యాడికిలో నిర్వహించడం ప్రజలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతమైంది. మండల కన్వీనర్. గొర్తి రుద్రమ నాయుడు, మాజీ ఎం.పీ.పీ. వేలూరు రంగయ్య, పరిమి చరణ్ ,నాగ ముని రెడ్డి , రవి కుమార్ రెడ్డి, బొట్టు శేఖర్, మధురాజు, వెలిగండ్ల ఆదినారాయణ, నీలకంఠ రెడ్డి, స్థానిక టి.డి.పి. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# డ్రైనేజీ సమస్యను పరిష్కరించిన ఈ.ఓ.ఆర్ డి. శశికళ



**యాడికి జులై 05:–** యాడికి మండలంలో తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి. అస్మిత్ రెడ్డి శనివారం యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో డ్రైనేజీ సమస్యను కాలనీవాసులు తెలియజేయగా పరిష్కరించాలని స్థానిక ఈ.ఓ.ఆర్.డి ని ఎమ్మెల్యే ఆదేశించారు వెంటనే సమస్యను కాలనీలో డ్రైనేజీ లలో పూడిక పేరుకుపోవడంతో పారిశుద్ధ కార్మికుల సహకారంతో క్లీన్ చేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో టి.డి.పి. మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, సచివాలయ సిబ్బంది స్థానిక టిడిపి నాయకులు. పాల్గొన్నారు

# బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మె సిఐటియు



**ఓబులవారిపల్లి జులై 05:–** కేంద్రంలో బి.జె.పి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను త్రిప్పికొట్టాలని సి.ఐ.టి.యు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, పిలుపునిచ్చారు. చిట్వేలు మండలంలో, ఎంఈఓ ఆఫీస్ ఆవరణంలో జరిగినసమావేశంలో పాల్గొని మాట్లాడారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మికులు ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి బడా కంపెనీల యజమానులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికుల శ్రమ దోపిడీని దోచుకు తినే విధంగా చట్టాలను మారుస్తున్నారని ఇది ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి భారతదేశంలో ప్రభుత్వఆస్తులన్నీ ఆదానీ, అంబానీ లాంటి కుబేరులకు కట్టబెట్టాలని చూస్తున్నారని తెలిపారు. కేంద్రం పనిగంటలను 12 గంటలకు పెంచి, రాష్ట్ర ప్రభుత్వం 10 గంటలకు, పని గంటల పెంచి, జీతాలు పెంచకుండా, దోపిడీ చేస్తుందన్నారు. కార్మికులకు పోరాడే హక్కు లేకుండా చేసి ఉద్యమాలను లేకుండా చేయాలని కుట్రలను కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాల ద్వారా బి.జె.పి దాని విధానాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జులై 9,వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో, అంగన్వాడీలు, ఆనిమేటర్సు, గ్రామ సేవకులు, ఆటో కార్మికులు, ఆశ వర్కర్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు,విద్యుత్తు, పంచాయతీ వర్కర్స్, పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు, పంది కాళ్ళ మణి, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఓ బిలి పెంచలయ్య పాల్గొన్నారు. అనంతరం, సిఐటియు చిట్వేల్ మండల సమన్వయ కమిటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికయింది. మండల కన్వీనర్ గా వై సుజాత, కో కన్వీనర్లుగా టి వెంకటరమణ, సి రంగారెడ్డి, కొరముట్ల సుధాకర్ ,కమిటీ సభ్యులుగా, నాని, షేక్ ఖాదరవల్లి, ఏ శ్రీనివాసులు, బొమ్మ సుబ్బరాయుడు, డి. నాగరత్నమ్మ జి. సుప్రత్నమ్మ, పి గంగాదేవి, వెంకటరత్నం, ఎం సుబ్రహ్మణ్యం, వై నరసింహులు, జి సాధకు, షేక్ సాదక్ వల్లి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చంద్రశేఖర్ ప్రకటించారు.

# సంక్షేమం,అభివృద్ధి సమపాళ్లలో కూటమి ప్రభుత్వం అందిస్తుంది



**రాజంపేట జూలై 05:–** ఒక వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు తెలిపారు. రాజంపేట మండలం కట్టా వారిపల్లి లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన త్రాగునీటి బోరు ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన టిడిపి నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోఅమలు చేసిన ప్రస్తుతం చేపట్టబోయే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నెరవేర్చిన ఎన్నికల హామీలను వివరించి అవగాహన కల్పించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా సమపాళ్లల్లో చూసుకోవడం కూటమి ప్రభుత్వం యొక్క గొప్పతనం అని చెప్తారు పథకాలు ప్రజలకు మేలు చేసేందుకే అని,గత ప్రభుత్వ పాలకులు ఊరిలో త్రాగు నీరు లేకపోయినా మద్యం జోరుగా పారించి దోచుకు తిన్నారని, అందుకే ప్రభుత్వం వచ్చి ఏడాది సందర్భంగా ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి వెళ్లి ప్రస్తుతం అందుతున్న పాలన గురించి, భవిష్యత్తులో కావలసిన పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకుని ప్రత్యేక నివేదికలు తయారు చేస్తున్నామని చెప్పారు.ఎన్నో ఏళ్లుగా తాము పడుతున్న నీటి కష్టాలు తీర్చిన కూటమి ప్రభుత్వానికి,చమర్తి జగన్ మోహన్ రాజు కు కట్టావారిపల్లి ప్రజలు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పారా సుబ్బానాయుడు, బాపనయ్య నాయుడు, రాజంపేట టిడిపి మండల అధ్యక్షుడు గన్నేసుబ్బ నరసయ్య నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్ల నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, కమ్మ సంఘం అధ్యక్షుడు శివ నారాయణ చౌదరి, పోలి చెరువు ప్రెసిడెంట్ నాగినేని నాగేశ్వర్ నాయుడు, దివాకర్ నాయుడు, మేడి కొండు రవి, వరదయ్య గారి పల్లి కేసి సుబ్రహ్మణ్యం, కే సతీష్, ఎంపీటీసీ నాగార్జున, సర్పంచ్ హరి, చిన్న బి, రామ య్య, మహేష్, ప్రకాష్, తమ్మినేని రామ నర్సింహులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ టెక్సమో మల్లికార్జున నాయుడు, వెంకటయ్య, దగ్గుపాటి వెంకటేశ్వర్ల నాయుడు, యువ నాయకులు పరుశురాం నాయుడు, మాచినేని బాలాజీ, రాజశేఖర్, అమ్మినేని సాయి, ప్రశాంత్, దగ్గుపాటి రవి, దగ్గుపాటి శ్రీనివాసులు, సురేంద్ర, కళాధర్, శ్రీనివాసులు, ముల్లగూరి మని, ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులు, టిడిపి ముఖ్య నాయకులు కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు

# పార్టీలో కష్టపడి పనిచేసే వాళ్లకే పదవులు: చమర్తి జగన్మోహన్ రాజు



**రాజంపేట జులై 05:–** తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసేవాళ్లే పదవులును పార్టీ పదవులు లభిస్తాయని ఇందులో ఎలాంటి పైరవీలకు తావు లేదని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు తెలిపారు. రాజంపేట ఏబి చంద్రారెడ్డి కళ్యాణ మండపంలో జరిగిన నియోజకవర్గ స్థాయి సుపరిపాలన తొలి అడుగు శిక్షణా శిబిరంలో నియోజకవర్గ అబ్జర్వర్లు, భీమినేని చిట్టిబాబు, సంస్థాగత ఎన్నికల అబ్జర్వర్ కిరణ్ కుమార్ మండల అబ్జర్వర్లు వెంకటేశ్వరరాజు, రమణ, వారితో కలిసి ఆయన ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కూల్చడంతో పాలన మొదలు పెడితే, కూటమి ప్రభుత్వం నిర్మించడంతో పాలన మొదలుపెట్టిందని, కూల్చడానికి కష్టపడాల్సిన అవసరం లేదని కానీ నిర్మించడానికి చాలా కష్టపడాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే దేశంలోనే అత్యంత టెక్నాలజీ వినియోగించుకుని నడుస్తున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని, ఇక్కడ ఎవరు ఏం చేస్తున్నారో, ఏ కార్యకర్త ఎంత పని చేస్తున్నారో, పార్టీ కోసం ఎవరు కష్టపడుతున్నారు అనేది అధిష్టానం వద్ద అన్ని లెక్కలు ఉన్నాయని, ఎవరో పైరవీ లు చేస్తే పదవులు రావని, కావున పదవుల కోసం ఎవరిని కాక పట్టాల్సిన అవసరం లేదని పార్టీ కోసం పని చేయాల్సిన అవసర లేదని తెలిపారు. కావున నాయకులు కార్యకర్తలు తొలి అడుగు పేరుతో వారి వారి గ్రామాల్లో ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి ఉన్న తేడాను స్పష్టంగా వివరించి, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు పథకాల గురించి తెలియజేయాలని సూచించారు. సంస్థాగతంగా దేశంలోని అత్యంత బలంగా ఉన్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని, కావున సంస్థాగతంగా బాధ్యతలు స్వీకరించాలనుకున్నవారు తప్పనిసరిగా పార్టీకి క్రమశిక్షణ గల కార్యకర్తగా నిరంతరం పనిచేసే ఆలోచన ఉంటేనే పదవులు తీసుకోవాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ చిట్టిబాబు, సంస్థాగత ఎన్నికల అబ్జర్వర్ కిరణ్ కుమార్, మండల అబ్జర్వర్ రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్ రాజు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్. టిడిపి మండల అధ్యక్షులు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, డి ఆర్ ఎల్ మని, భానుగోపాల్ రాజు, కళ్ళే రెడ్డప్ప, క్లస్టర్ ఇన్చార్జిలు కొల్లి రెడ్డయ్య నాయుడు, పసుపులేటి ప్రవీణ్ కుమార్, పలువురు టిడిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు యూనిట్ ఇన్చార్జీలు క్లస్టర్ ఇన్చార్జీలు బూత్ ఇన్చార్జీలుతదితరులు పాల్గొన్నారు.

# మామిడి రైతులని ఆదుకోండి: మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు

**రైల్వేకోడూరు జూలై 05:-** కోడూరు మండలం మైసూరువారిపల్లి పంచాయతి నందు ఉన్న మాంగో యార్డ్ ను సందర్శించి అక్కడ ఉన్న రైతులు,వ్యాపారస్థులతో మాట్లాడి అనంతరం పత్రిక విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యాపార రంగమే పూర్తిగా దివాలా తీసే పరిస్థితికి వచ్చింది అని ముఖ్యంగా కోడూరు అంటే బొప్పాయా, అరటి, మామిడి పేరు గాంచింది అని నేడు మామిడికాయ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కుదరక కనీసం కోతకోసిన తర్వాత కూలీలకు కూడా రాలేదని చాలామంది రైతులు కొన్ని తోటలను అలాగే వదిలేస్తునరాని కొంతమంది రైతులు అయితే అప్పులు తెచ్చి పంట పైన పెడితే కనీసం వాటికీ కొట్టిన మందులకి కూడా డబ్బులు వచ్చే పరిస్థితి లెదు అని తెచ్చిన దగ్గర వడ్డీలు కట్టలేక,అప్పులు కట్టలేక ఆత్మహత్య దిక్కు అనే వాపోతున్నారని ఇవన్నీ తెలిసిన కూటమి ప్రభుత్వం ఎక్కడ వాళ్ళని పటించుకునే పాపాన పోలేదు అని నామమాత్రంగా జిల్లా అధికారాలు రైతులు దగ్గరకి వచ్చి 4 రూపాయల ప్రభుత్వం తరపున ఇప్పిస్తామని చెప్పి వెళ్లిపోయారని ఇప్పటి వరకు ఒకరికి కూడా ఇవ్వలేదు అని మారి దారుణం ఏంటి అంటే అధికారులు వచ్చిన వెళ్లిన తర్వాత మరో ఒక రూపాయి తగిచ్చి ఫ్యాక్టరీ యజమానులు తీసుకుంటున్నారని, గతంలో 2005 లో వైస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి గా



ఉన్నపుడు ఇటువంటి క్లిష్టపరిస్థితి వచ్చినపుడు ఫ్యాక్టరీ యజమానులు అందరిని పిలిపిచ్చి ప్రతి రైతు దగ్గర పది రూపాయలకు తగ్గకుండా తీస్కోవాలని లేని యెడల ఫ్యాక్టరీలను ప్రభుత్వం స్వాదినంలోకి తీసుకుని నడిపిస్తామని ముక్కుసూటిగా వారితో చెప్పడంతో ఆ మరుసటి రోజు నుండి 18 రూపాయలకు కొన్నారని అదే విధంగా వైస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు మూడు వేల కోట్ల రూపాయలతో ధరల స్థిరికరణ నిధి ఏర్పాటు చేసి ఇటువంటి క్లిష్టపరిస్థితిలో వారికీ అందించారాని ఇదే మన పక్క రాష్ట్రం అయినా కర్ణాటక లో కేంద్ర మంత్రి కుమారస్వామి వారి రాష్ట్రంలో మామిడి రైతుల ఇదే సమస్యతో బాధపడుతూ ఉంటే సంబంధిత శాఖ మంత్రి శివరాజు సింగ్ చౌహన్ కి లేఖ రాయడంతో వెంటనే టన్ను 16 వేల రూపాయలతో 2లక్షల 50 వేల టన్నులు కొనడానికి ముందుకు వచ్చారని ఇదే మన రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం వల్లే కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిందని ప్రగల్బాలు చెప్పుకుంటున్నారే కానీ మీరు ఎందుకు ఆదుకోలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారువీలు అయినంత త్వరగా రైతులకు గిట్టుబాటు ధరకల్పిచి వారి ఆదుకోవాలని లేని యెడల ఇదే మామిడికాయల యార్డ్ వద్ద జాతీయ రహదారి పైన ధర్నాకు కూర్చుంటామని వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గం ఇంచార్జి, మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుబ్బరామరాజు, రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి,సర్పంచ్ నరేంద్రవర్మ,హరికృష్ణ రెడ్డి,సుబ్రహ్మణ్యం రాజు,సుదర్శన్ రాజు, పట్టణ అధ్యక్షుడు సిహెచ్ రమేష్, గుణిశెట్టి రమేష్,వెంకట్ రెడ్డి,కరీముల్లా సిద్దయ్య, డీవీ రమణ, గల్లా శ్రీను,మాథ్యూస్, తదితరులు పాల్గొన్నారు

# జిల్లా వ్యాప్తంగా ఈ నెల 10న మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్ సమావేశాలు

**• విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**కడప జులై 05:-** ఈ నెల 10వ తేదీన మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తు న్నట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.శనివారం స్థానిక కలెక్టరేట్ లోని వీసీ హాల్లో మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్ సమావేశాలపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు పాల్గొన్నారు.విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...రాష్ట్ర వ్యాప్తంగా "మెగా పేరెంట్ టీచర్ మీట్" కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రధాన్యతతో నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లోనూ, కళాశాలలోనూ మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ ఈనెల 10వ తేదీన నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులతో వన్-టు- వన్ సమావేశంనిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో విద్యార్థుల యొక్క మానసిక, సామాజిక స్థితి, ప్రవర్తన, అభ్యసన సామర్థ్యం.. గురించి సంబందిత క్లాస్ టీచర్ లేదా హెడ్ మాస్టర్ లతో పేరెంట్స్ చర్చించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల



విద్యాభివృద్ధి బాధ్యత కేవలం పాఠశాల ఉపాధ్యాయులదే కాకుండా.. తల్లిదండ్రులది కూడా ప్రధాన భూమిక బాధ్యత అన్న విషయాన్ని ఇందులో తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థికి చాలా వివరణాత్మకంగా.. ఆ విద్యార్థి యొక్క 6 నెలల అభివృద్ధికి సంబంధించి హెూలిస్టిక్ రిపోర్టుని కుడా అందివ్వడం జరుగుతుందన్నారు. పాఠశాల అభివృద్ధికి పేరెంట్స్ కమిటీ, టీచర్స్ మీటింగ్ చాలా ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలంటే.. పేరెంట్స్ కమిటీలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు భాగస్వామ్యం కావలి అన్నారు. పాఠశాలలో సాధించిన ప్రగతి విద్యార్థుల అభ్యున్నతికి ఈ పేరెంట్స్ టీచర్స్ మెగా ఈవెంట్లు దోహూత పడతాయని తెలిపారు. ఆరోజు పాఠశాల కళాశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే విధంగా ఆరోజు పాఠశాలల్లో మిడ్ డే మీల్ ఆరోజు మెనూ ప్రకారం తల్లిదండ్రులకు వడ్డించడం జరుగుతుందన్నారు. మిడ్ డే మీల్ లో విప్లవాత్మక మార్పులు జరిగాయని రాష్ట్రంలో మొదటి సారి స్మార్ట్ కిచెన్ ను సి కే దిన్నే,జమ్మలమడుగు లో త్వరలో ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు.నాలుగవ తరగతి పైబడిన విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులకు నమస్కరించి అమ్మ పేరు మీద చెట్టు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. లీప్ యాప్ ద్వారా విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత గ్రీన్ పాస్ పోర్టు పొందే విధంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీని ద్వారా పిల్లల్లో చిన్ననాటి నుండే పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేస్తున్నామని తెలిపారు. జులై 10వ తేదీన ఉదయం చెట్లు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల వారీగా ప్రజాప్రతినిధులు, పూర్వపు విద్యార్థులు, పాఠశాల కమిటీలు, దాతలు,తల్లిదండ్రులు భాగస్వాములై పిల్లల భవిష్యత్తుకు నూతన బాటలు వెయ్యాలని కోరారు.విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా నిర్వహించే మెగా పేరెంట్ టీచర్స్ మీట్స్ నిర్వహణ విజయవంతంగా జరిగేలా చూడాలని అందుకు మీడియా కూడా ప్రధాన పాత్ర పోషించాలనీ కోరారు.

# పకడ్బందీగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ ఏర్పాట్లు

**• ఈనెల 10వ తేదీన నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ లను విజయవంతం చేయండి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**కడప టౌన్ జులై 05:** - ఈ నెల 10వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశాలను పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారుశనివారం స్థానిక కలెక్టరేట్ లోని బోర్డు రూమ్ హాల్లో మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్ నిర్వహణ ఏర్పాట్ల పై.. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఎంఈఓలు మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు,జూనియర్ ప్రభుత్వ ,ప్రవేటు విద్యా సంస్థల అధ్యాపకులతో వర్చువల్ విధానంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రవేట్ ,ఎయిడెడ్పాఠశాలల్లో,కళాశాలలో మెగా పేరెంట్ టీచర్స్



సమావేశాన్ని పక్కా ప్రణాళికతో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. 'పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలు ప్రతి పేరెంట్ తో పాటు ప్రజాప్రతినిధులు,దాతలు, పూర్వపు విద్యార్థులకు, మీడియా వారికి అందించాలన్నారు.పాఠశాల గదులతో పాటు పరిసర ప్రాంతాల్లో 100శాతం పారిశుద్ధ్య పనులు చేపట్టి పుష్పాలతో పాఠశాలలను సుందరీకరించాలన్నారు.తరగతి గదుల్లోని బోర్డులపై చక్కటి కొటేషన్లు విద్యార్థులతో రాయించాలన్నారు.విద్యార్థులు అందరూ తమ అమ్మ పేరు మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పక్కాగా ఏర్పాట్లు చేయాలని విద్యాధికారులను ఆదేశించారు అలాగే మొక్కలు నాటిన అనంతరం వాటి సంరక్షణ పరిరక్షణ చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే లీప్ యాప్ ద్వారా రిజిస్టర్ అయిన విద్యార్థులకు గ్రీన్ పాస్పోర్ట్ అందించాలని అన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని డ్వామా శాఖతో ఎంఈఓ లు సమన్వయంతో చేసుకొని పని చేయాలన్నారుసమావేశాలకు హాజరైన తల్లిదండ్రులకు, ఆహ్వానితులకు డొక్కా సీతమ్మమధ్యాహ్నం బడి భోజనం ఆహార పదార్థాలను వడ్డించాలని అధికారులను ఆదేశించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు జరిపి మెగాపేరెంట్స్ కమిటీ మీటింగ్ లను విజయవంతంచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, ఎఫ్ ఓ సోషల్ ఫారెస్ట్రీ శివ కుమార్, జిల్లా పర్యాటకశాఖ అధికారి సురేష్ కుమార్, అగ్రికల్చర్ జెడి చంద్ర నాయక్, మెప్మా పిడి కిరణ్ కుమార్, డ్వామా పిడి ఆదిశేషారెడ్డి,సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, వివిధ జిల్లా శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ (కువైట్) ఆధ్వర్యంలో ఘనంగా వంగవీటి రంగా జయంతోత్సవాలు

**రైల్వే కోడూరు/కువైట్ జులై 05:** కువైట్ దేశంలో జనసేన పార్టీ కువైట్ అధ్యక్షులు ఎర్రం శెట్టి హరిబాబు రాయల్ ఆధ్వర్యంలో స్వర్గీయ వంగవీటి మోహనరంగా 78వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కుల మత పార్టీలకతీతంగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో హరిబాబు రాయల్ మాట్లాడుతూ పేదల పక్షపాతి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ వంగవీటి మోహనరంగా 78వ జయంతి వేడుకలు కువైట్ దేశంలో జరపడం చాలా ఆనందదాయకంగా ఉందని ఆయన ఒక వర్గానికే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు అండదండగా ఉంటూ బెజవాడ బెబ్బులి గా



పేరు ప్రఖ్యాతలు గడించిన ఖ్యాతి ఆయనకు మాత్రమే సొంతమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కువైట్ కార్యవర్గ సభ్యులు గ్రంధి ప్రసాద్ రాయల్, పవన్ ఉప్పుటూరు, గుంటిపల్లి గురేష్ రాయల్, అద్దేపల్లి పృథ్వీరాజ్, తోట చంగల్ రాయుడు, బల్లేపల్లి శ్రీనివాస్, గంటా రమేష్, సిరిశెట్టి మల్లికార్జున రాయల్, ఎర్రం శెట్టి నీలకంఠ రాయల్, దాసరి పృథ్వీరాజ్, అక్కిశెట్టి రాదే, మోదుగుల ప్రసాద్, సుబ్బిగారి నాగేంద్ర, చవ్వాకుల శేఖర్ పవన్, గంట కృష్ణ, శెట్టిపల్లి ప్రసాద్, చోళ రాజు ప్రవీణ్ రాజు, రోళ్ల నరసింహ మరియు ఇతర పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి: పి రామచంద్రయ్య



**పత్తికొండ, జూలై 05:-** విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. రామచంద్రయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టి డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శనివారం దేవనకొండలో సిపిఐ నాయకులు ర్యాలీ చేపట్టి నాలుగు స్తంభాల మండపం దగ్గర, దేవనకొండలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాల కోసమే విద్యుత్ స్మార్ట్ మీటర్లను అమలు చేస్తుందని విమర్శించారు. గత వైసిపి పాలనలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు పూనుకుంటే ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు తీవ్రంగా వ్యతిరేకించి స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేస్తామని చెప్పిన పెద్దమనిషి నేడు అధికారంలోకి వచ్చాక మోడీ ఒత్తిళ్లకు తలొగ్గి రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగించేందుకు పూనుకుంటే సిపిఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని మాయమాటలు చెప్పి, అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన చేసిందేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నాలుగు పర్యాయాలు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై పెను భారం మోపడం జరిగిందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సిపిఐ మండల కార్యదర్శి డి. రాజా సాహెబ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుమంచి, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, సురేంద్ర కుమార్, తిమ్మయ్య, కృష్ణయ్య, పెద్ద ఈరన్న, ప్రజా సంఘాల నాయకులు రంగన్న, నెట్టికంటయ్య,ముని, జొహరాపురం కాశీ, సిద్ధ లింగప్ప, రవికుమార్ పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

**- కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ శ్రీ కోయ ప్రవీణ్**

**కర్నూలు జూలై 05 :-** రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ , జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు.ఈ సంధర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత , ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్ లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు. 2025 (జనవరి నుండి జూన్ వరకు) గత 6 నెలల కాలంలో రోడ్డు ప్రమాదాల కేసులు మొత్తం 402 నమోదు అయ్యాయని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.జనవరి62 కేసులు,ఫిబ్రవరి73 కేసులు,మార్చి64 కేసులు,ఏప్రిల్ 73, కేసులు,మే 63 కేసులు,జూన్ - 67 కేసులు జరిగాయన్నారు.



తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం



# స్టోర్ బియ్యం తెచ్చుకోవాలంటే నాలుగు కిలోమీటర్ల నడిచాల్సిందే



**రామాపురం జులై 05:-** రామాపురం మండలం లోని రాచపల్లి గ్రామం బీదవాండ్ల పల్లె లో గత కొన్ని సంవత్సరాలుగా ఎస్సీలు 180 కుటుంబాలు బీసీలు 50 కుటుంబాలు ఓసీలు 20 కుటుంబాలు నివసిస్తున్నారు వీరంతా కూడా దాదాపుగా నాలుగు కిలోమీటర్ల పై నడిచి వెళ్లి కొమ్మురవాండ్ల పల్లి పోవాలంటే ముసలి ముతక ఇలాంటి రవాణా సౌకర్యం లేక అదే విధంగా దారి మధ్యలో వర్షాకాలంలో ప్రవహించే వాగు దాటి వెళ్లి బియ్యం తెచ్చుకోవాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికీ ఇదే పరిస్థితి కొనసాగుతుంది. కొన్ని సంవత్సరాల నుండి కూడా ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ప్రభుత్వాలు పోయిన మా జీవన చెల్లి మారడం లేదు మమ్ముల కరుణించే నాయకుడే అవపడటంలేదు. ఈ పేదవారి ఆవేదన ప్రభుత్వం దృష్టికి పోతుందని పేపర్లలో పత్రికల్లో వేస్తే ప్రభుత్వాలు దృష్టికి తెలిసి మాకు న్యాయం చేస్తారని కూడా మేము ఆశిస్తున్నాము. ఏ రాజకీయ పార్టీ వచ్చినా కూడా బడా నాయకులకి మేలు జరుగుతున్నది గాని ఈ పేదవారికి ఏమి న్యాయం జరగడం లేదని అందరూ ఆలోచిస్తున్నారు. ఈ రవాణా సౌకర్యాన్ని గుర్తించి సంబంధించిన అధికారులు దీని మీద చర్య తీసుకుంటారని ఈ మారుమూల ప్రాంతమైన బీదవాండ్ల పల్లెలో రైసు పంచే విధంగా అధికారులు న్యాయం చేస్తారని ఈ ఊరి ప్రజలు ముతక ముసలి మరియు బీదవాండ్ల పల్లి ప్రజలు అందరూ ఆశిస్తున్నారు అని, ఐటిడిపి స్పోకెన్ పర్సన్,జి వీరాంజులనేయుడు తెలియజేసారు

# ఇంటింటికి టిడిపి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా



**రాయచోటి జులై 05:-** ప్రతి ఇంట చంద్రబాబు నాయుడు చెప్పింది చేస్తున్నారు అనే మాట ప్రతి ఒక్కరి నోట వినిపిస్తున్నదిచంద్రబాబు నాయుడు పరిపాలన చాలా బాగుంది..గాజుల ఖాదర్ బాషా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అన్నారుచంద్రబాబు నాయుడు పరిపాలనకు ప్రతి ఇంటిలో ప్రజలు ఆశీర్వాదాలు అందిస్తున్నారని గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. శనివారం నాడు ఆయన గౌరవ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ సూచన మేరకు ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవైసిపి నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవ చేశారు ప్రజలందరూ పరిపాలన చాలా బాగుంది అని చెప్తుంటే అవి ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేయడం సబబు కాదని తెలిపారు చెప్పినవే కాకుండా ప్రజల కష్టాలు తెలుసుకుని చెప్పనవి కూడా ప్రజల కష్టాలు తీరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని ప్రతి ఇంట్లో చెబుతున్నారని చెప్పారు కూటమి ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు గత వైసిపి ప్రభుత్వం లో రాయచోటి నియోజకవర్గం లో వైసిపి నాయకులు కేవలం తమ సొంత ప్రయోజనాల గురించి ఆలోచించారు తప్పప్రజల కష్టాల గురించి పట్టించుకునే నాథుడే లేదని చెప్పారుమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.రాయచోటి నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా రాయచోటి నియోజకవర్గంలో ముఖ్యంగా త్రగునీటి సాగునీటి సమస్యను కూడా పరిష్కరించారని మరియు మైనార్టీల సమస్యలు బిసి ఎస్సీ ఎస్టీ ల సమస్యలు ఒక్కొక్కటి నెరవేరుస్తూ వెళుతున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రఫీ శేఖర్ రాము సికిందర్ తదితరులు పాల్గొన్నారు

# కుర్తివాడలో సిసి రోడ్డు పనులు ప్రారంభం



**పాపన్నపేట జులై 05:**మండల పరిధిలోని కుర్తివాడలో రెండవ వార్డులో సిసి రోడ్డు పనులను శనివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ సందర్భంగా సిసి రోడ్లకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాల నివారణ అప్రమత్తతతోనే సాధ్యం

**● తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష**

**తిరుపతి జూలై 05:-** అగ్ని ప్రమాదాల నివారణ అప్రమత్తంగా ఉండటం తోనే సాధ్యం అవుతుందని తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. గోవిందరాజుల ఆలయం సన్నిది వీధిలో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న నేపథ్యంలో మేయర్ డా శిరీష నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య గారితో కలిసి విపత్తు నివారణ అగ్ని మాపక శాఖ అధికారులు మరియు షాపు నిర్వాహకులతో సంస్థ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ తిరుపతి నగరం ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన నగరం అని.. నిత్యం శ్రీవారి భక్తులు సందర్శించే ఆలయాలు నగరంలో ఉన్నందున తిరుపతి నగర ప్రజలకు, శ్రీవారి భక్తులకు షాపు లో పనిచేసే కార్మికుల భద్రత రీత్యా అందరూ నిబంధనలు పాటిస్తూ అగ్ని ప్రమాదాలను నివారించాలని తెలిపారు. నగర ప్రాదాన్యత గొప్పగా ఉన్నా ప్రణాళిక లోపం కారణంగా రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, సినిమా దియేటర్లు కేంద్రీకరించి ఉన్నాయి. ఈ కారణంగా ప్రజలు ఒకే చోట గుమి కూడి ఉంటారు. విపత్తులు, అగ్ని ప్రమాదాలు జరిగితే నష్టం తీవ్రంగా ఉంటుంది.. అందుకే అగ్ని ప్రమాదాలు



జరగకుండా చూడటం అందుకుగాను అందరూ నిబంధనలను పాటించడం ఒక్కటే పరిష్కారం అన్నారు. ఈ మధ్య గోవిందరాజుల ఆలయం సన్నిది వీధిలో జరిగిన ప్రమాదాన్ని నేను పరిశీలించాను. ఆందోళన కలిగించే పరిస్థితులు కనిపిస్తుంది. గతంలో కూడా ఇదే ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగింది వాటి నుంచి మనం ఏమి నేర్చుకున్నాము ఆత్మపరిశీలన చేసుకోవాలి. నాకు ప్రధానంగా అర్థం అవుతుంది ఏమిటంటే విపత్తు నివారణ అగ్ని మాపక శాఖ నిబంధనలు పాటించకపోవడం, షాపులు ఒకే చోట కేంద్రీకరించి ఉండటంతో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు నివారణకు తగిన ప్రాధమిక ఏర్పాట్లు చేసుకోకుండా ఉండటం కనిపిస్తుంది. జిల్లా విపత్తు నివారణ అగ్ని మాపక శాఖ తో నగర పాలక సంస్థ విపత్తు నివారణ అగ్ని మాపక శాఖ సమన్వయం చేసుకుని షాపు నిర్వాహకులకు చైతన్యం కల్పించాలి. నగరంలో విస్తృతంగా తనికీలు నిర్వహించాలి. కనీసం గ్రూప్ షాపులు అందరూ కలిసి కనీస ప్రమాద నివారణ ఏర్పాట్లు చేసుకునేలా చూడాలి. నగరపాలక సంస్థ నుంచి తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నగర పాలక సంస్థ నుంచి చైతన్యం కల్పించి తగిన సహకారం అందిస్తామని తదనంతరం నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ అమరయ్య, ఎస్.ఈ శ్యామసుందర్,డి.సి.పి ఖాన్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్,రవి, ఆరోగ్యాధికారి యువ అన్వేష్, జిల్లా,నగరపాలక సంస్థ విపత్తు నివారణ అగ్ని మాపక శాఖ అధికారులు శ్రీనివాస రావు, నగరంలోని షాపు నిర్వాహకులకు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

**పీ4 తొలి సమావేశంలో రాష్ట్ర మంత్రి టీ.జీ. భరత్**

**కర్నూలు జూలై 05 :-**పేదరికం లేని సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరపాలక కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గానికి సంబంధించి స్వర్ణాంధ్ర-పీ4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్, పార్టనర్షిప్) తొలి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర విజన్ -2047 కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, మార్గదర్శి - బంగారు కుటుంబాల ఎంపిక అర్హతలు పక్కాగా పరిశీలించి లబ్దిదారులను ఎంపిక చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 2029 నాటికి నియోజకవర్గంలో 100% అర్హులందరికీ ఇళ్ళులు తప్పనిసరిగా ఉండాలని, అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. మున్సిపల్ పాఠశాలల స్థితిగతులను పరిశీలించి, అవసరమైన ఆధునికీకరణ పనులను చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని, పాతబస్తీలో విచ్చలవిడిగా ఉన్న కరెంట్ తీగల సమస్యను పరిష్కరించాలని సూచించారు.




ప్రధాన రహదారుల వెంట గోడలను శుభ్రపరిచి పెయింటింగ్ వెయ్యాలని, మొక్కలు నాటడం మరింత వేగవంతం చేయాలన్నారు. పార్కింగ్, వెండింగ్ జోన్ల ఏర్పాటు, పున్నమి రెస్టారెంట్ వెనుక ఖాళీ స్థలంలో వెండింగ్ జోన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు రహదారులపై ఆక్రమణలు తొలగించాలని, టిడ్కో గృహాల అభివృద్ధికి శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ. విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వం రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. తొలి సమావేశంలో పీ4 అమలు, ప్రధాన సమస్యల పరిష్కారం, అనేక అంశాలపై చర్చించామని వెల్లడించారు. భవిష్యత్తులో పేదరికం లేని సమాజాన్ని నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. అదేవిధంగా తాను ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ 6 హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఆగస్టు 15 నాటికి 15లక్షల బంగారు కుటుంబాలు, లక్ష మంది మార్గదర్శులను గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పీ4 ద్వారా సంక్షేమ పథకాల కోత ఉండదని, ఇది సంక్షేమానికి అదనమని సీఎం స్పష్టం చేశారు. బంగారు కుటుంబాలకు సరైన సమయంలో సహకారం, నిరంతర గైడెన్స్ ఇవ్వడం వంటివి మార్గదర్శులు బాధ్యత తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, తహశీల్దార్ రవికుమార్, మేనేజర్ యన్. చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ఎంఈ లీల ప్రసాద్, హార్టికల్చర్ ఏడి విజయలక్ష్మి, సిఎంఎం భాస్కర్ రెడ్డి, సూపరింటెండెంట్లు, పాల్గొన్నారు.

# రాయచోటి ఘటనపై తప్పుడు సమాచారం చేస్తే కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ హెచ్చరిక

**రాయచోటి జులై 05:-** రాయచోటి ఘటన గురించి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని, జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. జాతీయ భద్రతకు భంగం కలిగించేలా సోషల్ మీడియా ఇతర ప్రసారమాధ్యమాలలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేసినా, అవాస్తవాలను సృష్టించినా, పుకార్లు ప్రసారం చేసినా, షేర్ చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని మరియు సామాజిక మధ్యమాలలో గ్రూప్ అడ్మిన్ లు ప్రతి సమాచారాన్ని తనిఖీ చేసుకోవాలని, మరియు ఒక వేళ ఆయా గ్రూపుల్లో తప్పుడు సమాచారం వస్తే గ్రూప్ అడ్మిన్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. రాయచోటి ఘటన గురించి ఈ నెల 3వ తేదీన పత్రికా ప్రకటన జారీ చేశామని, ఈ విషయం గురించి కేంద్ర దర్యాప్తు బృందం విచారణ చేస్తున్నారు. కావున ఎటువంటి విషయాలు ఉన్నా అధికారికంగా అన్నమయ్య జిల్లా పోలీస్ వారు



తెలియజేస్తారు. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన విషయమని, ప్రజలు భయభ్రాంతులు కలిగించే ఊహాగానాలు, కథనాలు, దృశ్యాలు సృష్టించినా, పుకార్లు వ్యాప్తి చేసినా, ప్రసారం చేసినా షేర్ చేసినా అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాజంలో ముఖ్యంగా మీడియా పాత్ర విలువైనదని పోలీసు శాఖకు సహకరించాలన్నారు. ఏదైనా విషయానికి సంబంధించి పోలీసు అధికారులను సంప్రదించి నిర్ధారించుకోవాలని, తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్న వారిపై, సృష్టిస్తున్న వారిపై, షేర్ చేస్తున్న వారిపై నిఘా ఉంచినట్లు వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జాతీయ భద్రతకు కు సంబందించిన విషయాలలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం చాలా తీవ్రమైన నేరం గా పరిగనించబడుతుంది. మరియు చట్ట పరమైన పర్యావసనాలు కఠినంగా ఉంటాయి. కావున ఏదైనా సమాచారాన్ని షేర్ చేసే ముందు దాని ప్రమాణీకతను తనిఖీ చేసుకోవడం చాలా ముఖ్యమని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు సూచించారు.

# ప్రపంచవ్యాప్తంగా 10 లక్షల రోబోలను మోహరించిన అమెజాన్

**● డీప్‌ఫ్లీట్' పేరుతో కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్ ఆవిష్కరణ ● రోబోల వల్ల డెలివరీలు మరింత వేగవంతం అంటున్న కంపెనీ ● కొత్త నైపుణ్యాలతో ఉద్యోగాలు పెరుగుతాయని అమెజాన్ వాదన ● భవిష్యత్తులో ఉద్యోగుల సంఖ్య తగ్గుతుందని అంగీకరించిన సీఈవో**

**ఉరవకొండ జులై 05:-** ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ టెక్నాలజీ వినియోగంలో మరో సంచలనానికి తెరలేపింది. తమ గిడ్డంగుల్లో పనిచేసే రోబోల సంఖ్య 10 లక్షల మైలురాయిని దాటిందని ప్రకటించింది. అదే సమయంలో రోబోల పనితీరును మరింత మెరుగుపరిచేందుకు 'డీప్‌ఫ్లీట్' అనే శక్తిమంతమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మోడల్‌ను కూడా ప్రవేశపెట్టింది. అయితే, ఈ సాంకేతిక అభివృద్ధి ఒకవైపు డెలివరీల వేగాన్ని పెంచుతుందని చెబుతున్నప్పటికీ, మరోవైపు ఉద్యోగుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఆటోమేషన్



కారణంగా భవిష్యత్తులో ఉద్యోగుల సంఖ్య తగ్గే అవకాశం ఉందని కంపెనీ సీఈవో యాండీ జెస్సీ అంగీకరించడం ఈ ఆందోళనలకు బలం చేకూరుస్తోంది. అమెజాన్ రోబోటిక్స్ వైస్ ప్రెసిడెంట్ స్కాట్ డ్రెస్సర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే మొబైల్ రోబోటిక్స్ తయారీ, నిర్వహణలో అమెజాన్ అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. కొత్తగా తీసుకొచ్చిన డీప్‌ఫ్లీట్ ఏఐ ద్వారా రోబోల ప్రయాణ సమయం 10 శాతం వరకు తగ్గుతుందని చెప్పారు. దీనివల్ల వినియోగదారులకు మరింత వేగంగా, తక్కువ ఖర్చుతో ఉత్పత్తులను అందించగలుగుతామని వివరించారు. రోబోలు మనుషులతో కలిసే పనిచేస్తాయని బరువైన, మళ్లీమళ్లీ చేయాల్సిన పనులను అవి చూసుకుంటాయని, తద్వారా ఉద్యోగులకు కొత్త సాంకేతిక నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఉదాహరణకు, లూసియానాలో ఇటీవల ప్రారంభించిన కొత్త కేంద్రంలో ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన ఉద్యోగుల అవసరం 30 శాతం పెరిగిందని తెలిపారు. అయితే, కంపెనీ వాదనకు భిన్నంగా సీఈవో యాండీ జెస్సీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఇటీవల ఆయన మాట్లాడుతూ "ఏఐ టెక్నాలజీని విస్తృతంగా వాడటం వల్ల, కొన్ని పనులను ఆటోమేట్ చేయడం ద్వారా వాటిని చేసే ఉద్యోగుల అవసరం తగ్గుతుంది" అని స్పష్టం చేశారు. ఏఐ, రోబోటిక్స్ రంగాల్లో నియామకాలు కొనసాగిస్తామని చెప్పినప్పటికీ, రాబోయే సంవత్సరాల్లో సాంకేతిక పురోగతి కారణంగా తమ మొత్తం ఉద్యోగుల సంఖ్య తగ్గే అవకాశం ఉందని ఆయన ఒక అంతర్గత మెమోలో అంగీకరించారు. ఈ పరిణామం టెక్ రంగంలో ఆటోమేషన్ ప్రభావంపై కొత్త చర్చకు దారితీసింది.

# బిక్షగాళ్ల పునరావాస కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి: కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి జూలై 05:-** నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బిక్షగాళ్ల పరివర్తన కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. స్మైల్ ప్రాజెక్ట్ లో భాగంగా స్థానిక ముత్యాలరెడ్డి పల్లి వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బిక్షగాళ్ల పునరావాస కేంద్రాన్ని శనివారం ఉదయం కమిషనర్ పరిశీలించారు. అక్కడ ఉన్న వారితో ఎక్కడి నుండి వచ్చారు, పునరావాస కేంద్రంలో వసతులు ఎలా ఉన్నాయి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో బిక్షగాళ్లు లేకుండా వారిని సరైన మార్గంలో నడిపించేందుకు ఈ పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. నగరంలో ఎక్కడైనా బిక్షగాళ్లు ఉంటే ఈ కేంద్రంకు తీసుకు రావచ్చని తెలిపారు. వీరికి ఈ కేంద్రంలో అన్ని వసతులు కల్పించి వారికి ఇష్టమైన వృత్తిలో శిక్షణ ఇస్తామని అన్నారు. అనంతరం వారు తిరిగి బిక్షాటన చేయకుండా వారి కాళ్ళ మీద వారు నిలబడేలా శిక్షణ ఇచ్చి పంపుతామని అన్నారు. నగరంలో ఎక్కడైనా బిక్షగాళ్లు ఉంటే వారిని ముత్యాలరెడ్డి పల్లి లోని పునరావాస కేంద్రానికి తీసుకురావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. అనంతరం ముత్యారెడ్డి పల్లి వద్ద గల పార్కును పరిశీలించారు. పార్కులో పాడైన వ్యాయామ, ఆట వస్తువులను మరమ్మత్తులు చేయించి, శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

# 15వ డివిజన్లో సుపరిపాలన తొలి అడుగు పర్యటన: కొండా సుబ్బయ్య



**కడప రూరల్ జూలై 05:-** 15వ డివిజన్ నందు డివిజన్ ఇంచార్జి కొండా సుబ్బయ్య మన ప్రియతమ నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశా అంశారం పరిపాలన తొలి అడుగు 1 సంవత్సరం టిడిపి చేసినస సంక్షేమ అభివృద్ధిపై పథకాలపై 15 డివిజన్లోని శివానందపురం కాలనీ యందు ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ అలాగే శివానందపురం లోని ప్రైమరీ స్కూల్లో పిల్లలతో కొండా సుబ్బయ్య మాట్లాడుతూ మీ స్కూల్లో అందరికీ తల్లికి వందనం వచ్చిందా అని అడగగా అందరూ కేకలతో మాకు అందరికి వచ్చింది అన్నారు అలాగే స్కూల్లో గవర్నమెంట్ మీకు ఏమేమి ఇస్తున్నారు అని అడగగా మాకు పుస్తకాలు బ్యాగు బట్టలు బెల్టు షూ అండ్ సాక్సులు మరియు భోజనం వారంలో ఐదు రోజులు గుడ్డు చెక్కిలు మరియు మధ్యాహ్నం మంచి రుచికరమైన భోజనం పెడుతున్నారు అలాగే మమ్మల్ని సొంత బిడ్డల్లాగా చూసుకుంటూ మాకు పాటలు నేర్పిస్తున్నారు కుండా సుబ్బయ్య పిల్లలతో మీరు పెద్ద అయితే ఏమవుతారు అని అడగగా వారు రకరకాలుగా డాక్టర్ ఇంజనీర్ కలెక్టర్ పోలీస్ ఇలా ఆనందంగా చెప్పారు అలాగే హెడ్ మేడం గారితో మేడం గవర్నమెంట్ మరియు పిల్లల తల్లిదండ్రులు మీ మీద నమ్మకంతో పిల్లలను మీకు అప్పజెప్పారు వారిని అన్ని విధాల ప్రయోజకులగా తీర్చిదిద్ది పై చదువులకు హై స్కూల్ కు పంపించే బాధ్యత మీది అని చెప్పగా మేము కూడా గవర్నమెంట్ స్కూల్లో చదువుకొని ఈ స్థాయికి వచ్చిన స్థాయి మర్చిపోము మా మనస్ఫూర్తిగా పిల్లలను అన్ని విధాల మా శక్తికి మించి తయారు చేసేకి ప్రయత్నిస్తాము అని వారు అన్నారు


# ఘనంగా ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**పాపన్నపేట జూలై 05:-** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పుల్లన్న గారి ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం పాపన్నపేట మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మల్లంపేట గ్రామ శివాలయంలోఅభిషేకం, వివిధ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఆయన అనుచరులు ప్రశాంత్ రెడ్డి పేరు మీద సాంగ్ రిలీజ్ చేశారు. వాహనాలతో భారీ ర్యాలీగా ఏడుపాయల చేరుకొని వన దుర్గ మాత సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. మల్లంపేట, కందిపల్లి యువకులతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రాయచోటిలో అరెస్ట్ అయిన ఇస్లామిక్ ఉగ్రవాదుల మూలాలపై సమగ్ర విచారణ జరిపించాలి

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతు గుంట రమేష్ నాయుడు




**రాజంపేట జూలై 05:-** జిల్లాకేంద్రం అయిన రాయచోటిలో ఇటీవల అరెస్టు అయిన ఇస్లామిక్ ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధికి, మహమ్మద్ అలీ యొక్క మూలాలపై జిల్లా పోలీసు యంత్రాంగం సమగ్ర విచారణ జరిపించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ పోతు గుంట రమేష్ నాయుడు తెలిపారు. రాజంపేట బిజెపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అరెస్టు కాబడిన ఇస్లామిక్ ఉగ్రవాదులు మరింత మంది స్లీపర్ సెల్స్ ఇస్లామిక్ ఉగ్రవాదులను తయారు చేసి ఉంటారని వీరి మూలాల పై శోధించాలని తెలిపారు. భారత దేశాని అస్థిరపరిచే వ్యూహం లో భాగమే ఈ స్లీపర్ సెల్స్ ఉద్దేశమని,దొరికిన ఇస్లామిక్ తీవ్రవాదులు ఆషామాషీ వ్యక్తులు కాదు అని వీరి గత చరిత్ర బట్టి తెలుస్తున్నదని వివరించారు. సాధారణ వ్యక్తులు గా మసులుకుంటూ తమ కార్యాచరణ ను నిరాటంకంగా కొనసాగిస్తున్న వీరికి స్థానికంగా సహాయ సహకారాలు లేకుండా 30సంవత్సరాలుగా వీరి కార్య కలాపాలు నిర్వహించుకోవడం అసాధ్యమని తెలుస్తుందని తెలిపారు. అకారణం గా గతం లో జిల్లాలో హిందూ సంస్థల కార్యకర్తల పై లాఠీ ఛార్జీ చేసే ఉత్సాహం ప్రదర్శించిన జిల్లా పోలీసులు, జిల్లాపోలీసు అధికారులు. జిల్లాలోఇస్లామిక్ తీవ్రవాదం పై కూడా అదేరితిన చర్యలు తీసుకుంటే ప్రజలు హర్షిస్తారని,రాయచోటి ఘటన ను దృష్టి లో ఉంచుకునిఇస్లామిక్ స్లీపర్ సెల్స్ ను శోధించి అరెస్టు చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. ఐసిస్, అలూమా ఒకే రకమైన భావజాలం కలిగి ఉన్న సంస్థల నుంచి వచ్చిన వ్యక్తులు వీరు వీరి వద్ద దాదాపు 50 ఐఈడీలు తయారు చేసే సామగ్రి స్వాధీనం చూసుకోవడం అంటే సాధారణ విషయం కాదు వీరికి స్థానికంగా వ్యక్తులు ఎంతోమంది సహకరించెంటనే ఇది సాధ్యపడుతుందని వీరికి సహకరించిన వారిని మరియు వీరు వల్ల ప్రేరేపిత పొందిన వారందరిని గుర్తించి వారిపై లోతైన విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలని రిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా బయట వ్యక్తులు ఎవరు వస్తున్నారు? ప్రజలు కూడా గమనించాలని బిజెపి సూచిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టు పోగుల ఆదినారాయణ పట్టణ ప్రధాన కార్యదర్శి యన్ గిరీష్ మండల ఉపాధ్యక్షులు రేణు ప్రసాద్ రాజు బిజెపి పార్లమెంట్ నాయకులు తోట నగేష్ తదితరులు పాల్గొన్నారు

# జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 18000 కేసులు పరిష్కారం



**కడప జూలై 05:-** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ , అమరావతి వారి ఆదేశానుసారంగా గౌరవ జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 05 వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడినది. జిల్లా వ్యాప్తంగా 24 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగినది. కడప నందు 6, ప్రొద్దుటూరు నందు 3, రాజంపేట నందు 3, రాయచోటి నందు 3, బద్వేల్ నందు 3, లక్కిరెడ్డిపల్లి, రైల్వే కోడూర్, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందల మరియు కమలాపురం కోర్టుల నందు ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేయడం జరిగినది. జాతీయ లోక్ అదాలత్ లో జిల్లావ్యాప్తంగా 18000 కేసులు పరిష్కరించబడినవి. Rs.14,03,00,338/-%మొత్తము కక్షిదారులకు చెల్లించడం జరిగినది. జాతీయ లోక్ అదాలత్ లో న్యాయమూర్తులు మరియు లోక్ అదాలత్ మెంబెర్స్, కక్షిదారులు వారి వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి వారి వారి కేసులను పరిష్కరించుకోవడం జరిగినది. పెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగినది. జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసినందులకు గానున్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీసు అధికారులకు, వైద్య అధికారులకు, పత్రికా సిబ్బందికి, డిస్టిక్ పబ్లిక్ రిలేషన్ అధికారులకు, రవాణాశాఖ అధికారులకు, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ అధికారులకు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ అధికారులకు, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులకు, పత్రికా విలేకరులకు, ఆల్ ఇండియా రేడియో కడప వారికి, రవాణాశాఖ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖ అధికారులకు, అడ్వకేట్ క్లర్కు లకు, అగ్రికల్చరల్ అధికారులకు మరియు మిగతా శాఖల అందరికీ డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప మరియు ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆలూరు టిడిపి ఇంచార్జ్ వ్యవహారంలో రచ్చ

- వీరభద్ర గౌడ్ తొలగింపు పై నిరసన తెలిపిన ఆయన అభిమానులు
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వ్యవహారం



**ఆలూరు జులై 05:-**కర్నూలు జిల్లాఆలూరు లో తొలి అడుగు కార్యక్రమంలో టిడిపి ఆలూరు ఇంచార్జి వీరభద్ర గౌడ్ వర్గీయులు జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డిని అడ్డుకొని గో బ్యాక్ అంటూ నిరసన వ్యక్తం చేశారు. ఆయన అధిష్టానం సూచన మేరకు వీరభద్ర గౌడ్ ఇన్చార్జి పదవ నుంచి తొలగిస్తున్నామని ప్రకటించగానే వీరభద్ర గౌడ్ అభిమానులు గందరగోళం సృష్టించారు. ఈ కార్యక్రమానికివీరభద్ర గౌడ్ ను ఎందుకు ఆహ్వానించలేదని వీరభద్ర గౌడ్ వర్గం జిల్లా అధ్యక్షుని నిలదీశారు. ఇంచార్జ్ ని నియమించిన తర్వాతనే మీటింగ్ ఏర్పాటు చేయాలని, సభను జరగనివ్వమని గౌడ్ వర్గీయులు సభను అడ్డుకున్నారు. జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి డౌన్ టౌన్ అంటూ నినాదాలు చేసిన వీరభద్ర గౌడ్ ఆముచారులు బయట నుంచి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే తిక్కారెడ్డివీరభద్ర గౌడ్ అనుచరులను పోలీసులు ద్వారా బయటికి పంపి వేశారు. కొంతమేర సభా సమావేశం గందరగోళంగా మారింది. కొత్త ఇన్చార్జి ఎవరొచ్చినా పార్టీ కోసం కార్యకర్తలు పని చేస్తామని వీరభద్ర గౌడ్ వర్గీయులు తెలిపారు. అనంతరం సభ సజావుగా సాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ బస్తి పాటి నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఇతర టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చకుండా ప్రజల్లోకి ఎలా వెళతారు?: ఎమ్మెల్యే ఆకేపాటి




**రాజంపేట జూలై 05:-** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఏడాది అవుతున్న నెరవేర్చకుండా సిగ్గు లేకుండా మళ్లీ తొలి అడుగు అనే కార్యక్రమంతో ప్రజల్లోకి టిడిపి నేతలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంపించడం హాస్యాస్పదంగా ఉందని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి దుయ్యపట్టారు. రాజంపేట జిఎంసి కళ్యాణ మండపంలో నిర్వహించిన వైఎస్ఆర్సిపిరాజంపేట నియోజకవర్గ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆకే పాటి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ రాజంపేట లో టిడిపి తరఫున పోటీ చేసిన అభ్యర్థి బాలసుబ్రమణ్యం కే న్యాయం జరగక జగన్ సమక్షంలో వైసిపి పార్టీలో చేరారని ఇక ప్రజలకు ఏ విధంగా వారు న్యాయం చేస్తారని ఆరోపించారు. దమ్ముంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల వద్దకు వెళ్లాలని సవాల్ విసిరారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ఏమీ చేయలేక పోయిందని తెలుసుకున్న ప్రజలు వైసిపి సమావేశాలు ఏ ప్రాంతంలో పెట్టిన ఆ సభలకు సమావేశాలకు ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారని చెప్పారు. వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నాయకులు కూడా ప్రజల్లోకి వెళ్లి కూటమి ప్రభుత్వం అన్యాయాలను అక్రమాలతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చని విషయంపై ప్రజలకు విపులంగా వివరించి వారిని చైతన్యవంతులు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా పరిశీలకులు మేయర్ సురేష్ బాబు , రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి ,మాజి ఎంపీపీ భాస్కర్ రెడ్డి , వీరబల్లి ఎంపీపీ రాజేంద్ర నాథ్ రెడ్డి, వైఎస్ఆర్సీపీ కమిటి సభ్యులు, నాయకులు జడ్పీటీసీ లు,మున్సిపల్ చైర్మన్,మున్సిపల్ కౌన్సిలర్స్,ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

# తాళ్లపాక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి




**రాజంపేట జూలై 05:-** అన్నమాచార్యులు ఆరాధ్య దైవాలైన శ్రీ సిద్దేశ్వర, చెన్నకేశవ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ ఉత్సవాలు నేటి ఈనెల 15వ తేదీ వరకు టిటిడి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అన్నమయ్య ధ్యాన మందిరం ప్రక్కన ఉన్నటువంటి కళ్యాణ మండపాన్ని ఉత్సవాల నిర్వహించేందుకు ముస్తాబు చేశారు. అదేవిధంగా భక్తుల కోసం ప్రత్యేక చలువ పందిళ్ళ ను ఏర్పాటు చేశారు. సిద్దేశ్వర చెన్నకేశవ స్వామి ఆలయాలను ఉత్సవాలకు ముస్తాబు చేశారు. తాళ్లపాక ముఖ ద్వారం వద్ద ఉత్సవాలను సూచించే విద్యుత్ దీపాలంకరణ బోర్డులను ఏర్పాటు చేసి ముఖద్వారం నుంచి తాళ్లపాక వరకు ఉత్సవాలకు సంబంధించిన స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలకు సాయంత్రం 6:30 గంటలకు అంకురార్పణ కార్యక్రమం నిర్వహించి ఆదివారం ఉదయం 6 గంటలకు సిద్దేశ్వర చెన్నకేశవ స్వామి ఆలయాల్లో వేరువేరుగా ధ్వజారోహణ కార్యక్రమంతో ఉత్సవాలను ప్రారంభించినట్లు తాళ్లపాక ఆలయాల ఇన్స్పెక్టర్ బాలాజీ తెలిపారు. కావున భక్తులందరూ ఈ ఉత్సవాలకు విరువగా హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# రాగమయమైన భారతీయ సంస్కృతిని పాశ్చాత్య సంస్కృతి రోగమయం చేసినది

- డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే
- గోపూజతో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు



**కర్నూలు జూలై 05:-** ప్రపంచానికి ఆదర్శాన్ని అందించిన భారతీయ సంస్కృతి ఈనాడు పాశ్చాత్య పోకడల వలన దేశంలో అనేక అనర్థాలు జరుగు తున్నాయని, రాగమయమైన భారతీయ సంస్కృతిని పాశ్చాత్య సంస్కృతి రోగమయం చేసినదని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జూపాడుబంగ్లా మండలం, తరిగోపుల గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాలలో భాగంగా మూడు రోజులపాటు ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్, శ్రీనివాస రామానుజ దాసు చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. శ్రీమద్రామాయణం, మహా భారతం, భగవద్గీతలపై వారు చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను మంత్రముగ్దులను చేశాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీశ్రీశ్రీ గురుసిద్ద నాగసాయి బ్రహ్మవిద్యా ఆశ్రమం పీఠాధిపతులు శ్రీశ్రీ రామానంద స్వామీజీ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు గ్రామగ్రామాలలో నిర్వహించాలని అభిలశించారు. గ్రామ సర్పంచు ఆంజనమ్మ, అర్చకులు రామచంద్రయ్యస్వామి, గ్రామ పెద్దలు మందడి నారాయణరెడ్డి, మద్దికుంట నాగర్జునరెడ్డి, కొత్త నాగేశ్వరావు, ధర్మ ప్రచార మండలి సభ్యులు ఎ.శివశంకర రెడ్డి, పి. రామచంద్రుడు, స్థానిక భజన మండలి సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


# నేమకల్లు అంజన్నకు ప్రత్యేక పూజలు




**బొమ్మనహాళ్ జూలై 05:-** మండల పరిధిలోని,అత్యంత, ప్రసిద్ధి గాంచిన,నేమకల్లు ఆంజనేయస్వామికి,ప్రత్యేక పూజలు నిర్వహించారు,ఈ సందర్భంగా స్వామివారిని పుష్పలతో శోభాయమానంగా అలకరించారు,ఆలయ అర్చకులు, ఆధ్వర్యంలో పురోహితులు, వేకువజాము నుంచే,స్వామివారికి కుంకుమార్చన,అభిషేకాలు చేశారు, భక్తులతో ఆలయం పోటెత్తరు, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు,అనంతరం ఆలయ కమిటి సభ్యులు,భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు,

# ఆర్థిక వైఫల్యాలకు చికిత్స లేదా

బ్యాంకులకు లక్షల కోట్లు ఎగవేసిన మాల్యా, నీరవ్ మోడీ లాంటి వారంతా విదేశాల్లో ఎంజాయ్ చేస్తున్నారు. దేశంలోనే ఉన్న మరికొందరు ఎగవేతదారులు రాజకీయాలను అడ్డం పెట్టుకుని దర్జాగా బతికేస్తున్నారు. రాజకీయాల్లో ఉంటూ అవినీతికి పాల్పడుతున్న వారు పదవులు వెలగబెడుతున్నారు. రాష్ట్రాల వనరులను లూటీ చేసిన వారు,దేశ సంపదను లూటీ చేసిన వారు పదవులతో మనలను పాలిస్తున్నారు. రాజకీయ నాయకుల, వ్యాపారుల అవినీతి కారణంగా దేశ వనరులు దెబ్బతింటున్నాయి. ఖజానా ఖాళీ అవుతోంది. వారి జీత భత్యాలు, వారి విలాసాల కారణంగా లక్షల కోట్లు ఏటా వృధా అవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో రాజకీయ నాయకులను మేపడానికి అవుతున్న లెక్కలు చూస్తే ఆశ్చర్యం కలగమానదు. అధికారం, దర్పం అనుభవించడానికే చాలామంది రాజకీయాల్లో ఆసక్తి చూపుతున్నారు. కానీ సామాన్యులు, ఓట్లేసిన వారు మాత్రం అడుక్కునే పరిస్థితి కల్పించి వారికి బిచ్చమేస్తున్నారు. కిలోరూపాయి బియ్యం, పెన్షన్ల పందేరాలతో పాలనను చేస్తున్నట్లు భ్రమింప చేస్తున్నారు. అవినీతి, అక్రమాల కట్టడి చేయడంలో పాలకులు పూర్తిగా విఫలం అవుతున్నారు. అనేక అక్రమాలు వెలుగుచూస్తున్నా..అరికట్టడంలో విఫలం అవుతున్నారు. అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చాక అశ్లీలత పెరిగిపోయింది. అశ్లీల వెబ్‌సైట్లను అరికట్టడం లేదు. పాన్,గుట్కా, మందులకు సంబంధించి ప్రకటనలు యదేచ్ఛగా టీవీల్లో వచ్చేస్తున్నాయి. అశ్లీల ప్రకటనలు కూడా యువతను పెడదారి పట్టిస్తున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే ఇటీవలి కాలం వరకు లోన్ యాప్ వాళ్లు చేసిన హింసాకాండ అంతా ఇంతాకాదు. వడ్డీలతో డబ్బులు సంపాదించాలనుకున్న వారు ఇలా ఏర్పాటు చేసి ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్న తీరును చూశాం. ఇక దేశంలో విరివిగా రుణాలు ఇచ్చి, ఉపాధిరంగాలను ప్రోత్సహిస్తే యువత సమస్య తీరేది. నిరుద్యోగు లకు ఉపాధి దక్కేది. భారతీయ బ్యాంకులు సామాన్యులకు రుణాలు ఇవ్వండంలో ఎంత కఠినంగా ఉంటున్నాయో వేరుగా చెప్పనక్కర లేదు. సూటుబూటు వేసుకుని వచ్చే వారికి అప్పనంగా వేలకోట్లు కట్టబెట్టి రుణాలు ఇస్తున్న బ్యాంకులు.. సామాన్యులకు మాత్రం లక్ష ఇవాలంటే సవాలక్ష కొర్రీలు పెడుతున్నాయి. మాల్యా, నీరవ్ మోడీ లాంటి వారు ఇలాగే బ్యాంకులకు వేలకోట్లు ఎగవేసి విదేశాల్లో ఎంజాయ్ చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలనలో వీరిని పట్టుకుని తీసుకుని రావడంలో పూర్తిగా విఫలం అయ్యారు. నిజానికి మన బ్యాంకులు సులభంగా పేద, మధ్య తరగతి




ప్రజలకు రుణాలు ఇచ్చినట్లయితే ఉపాధి రంగం బలపడేది. పెట్టుబడుల కోసం విదేశాల చుట్టూ తిరగాల్సిన అవసరం వచ్చేది కాదు. లక్షల కోట్లు ఎగవేసిన మాల్యా, నీరవ్ మోడీ లాంటి వారిని ఏమీ చేయలేక బ్యాక్లరు చేతులెత్తేస్తు న్నారు. రాయపాటి సాంబశివరావు లాంటి రాజకీయవేత్తలు వందల కోట్లు ఎగవేసినా కిమ్మనరు. నిజానికి ఏళ్లతరబడి బ్యాంకుల్లో అకౌంట్లు పెట్టి నడుపుతున్న సామాన్యుల అవసరాలను గుర్తించడంలో బ్యాంకులు పూర్తిగా విఫలమయ్యాయని చెప్పాలి. ప్రధాని ప్రవేశ పెట్టిన రుణ పథకాలు కూడా సామాన్యులందరికీ అందడం లేదు. అలాగే ప్రజలు కూడా ఇచ్చిన రుణాలు చెల్లించాలన్న శ్రద్ద కనబర్చకపోవడం కూడా ప్రధాన కారణంగా చూడాలి. రుణమిస్తే ఎగవేయవచ్చన్న ఆలోచన కూడా ప్రజల్లో బాగా బలపడిపోయింది. అందుకే ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు ప్రజల అవసరాలను గుర్తించి వారిని లోబర్చుకుంటున్నారు. రుణాల పేరుతో వారిని జలగల్లా పీలుస్తున్నారు. ఎటువంటి ష్యూరిటీ లేకుండా... మన గురించి తెలియకుండా.. కనీసం ముఖం చూడకుండా లోన్ ఇస్తామంటే ఎవరు కాదంటారు అవసరం ఉన్నా లేకున్నా తీసుకుంటారు! కానీ, ఆ తరువాతే అసలు సినిమా మొదలవుతుంది. ఫోన్లలోనే బెదిరింపులు, వేధింపులు వస్తుంటాయి. అప్పుల యాప్‌ల వలలో చిక్కుకున్నట్లే! అసలుకు ఎన్నో రెట్లు వడ్డీ కట్టిన వారు కొందరయితే... డబ్బులు కట్టలేక... పరువు పోతోందనే ఆవేదనతో ఆత్మహత్మలు చేసుకుంటున్న వారు మరికొందరు! దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల ప్రజలు అప్పుల యాప్‌ల బారిన పడ్డారని.. పెరుగుతన్న బాధితులు సంఖ్యను బట్టి అర్థం చేసుకోవచ్చు. కరోనా కారణంగా చాలామంది ఉద్యోగాలు పోయి..ఉపాధి కూలిపోయి...చేతుల్లో డబ్బులు లేక ఇలాంటి యాప్‌లను ఆశ్రయించరు.చేస్తున్న ఉద్యోగాలు ఊడిపోవడంతో... అప్పు ఇచ్చే వారికోసం చాలామంది ఎదురు చూస్తున్నారు. సరిగ్గా ఇలాంటి వారినే అప్పుల యాప్‌లు వలలో వేసుకుంటున్నాయి. ష్యూరిటీలేదంటూనే... నిబంధనల్లో భాగంగా ఫోన్‌లోని కాంటాక్ట్స్ మొత్తం 'యాక్సెస్' తీసుకుంటాయి. అలా తమ వలలో చిక్కుకున్న వారిని వడ్డీ మీద వడ్డీ లాగుతారు. కట్టలేని పరిస్థితి వస్తే... ఫోన్లు చేసి వేధిస్తారు. బెదిరిస్తారు. అప్పు తీసుకున్న వారి ఫోన్లలోని కాంటాక్ట్స్‌కు మెసేజ్‌లు పంపిస్తారు. జాతీయ బ్యాంకుల అండ లేకపోవడంతో రుణ యాప్ నుంచి అప్పు తీసుకుని... ఎంతోమంది ఊబిలో కూరుకు పోతున్నారు. హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై లాంటి నగరాలు కేంద్రంగా ఎన్నెన్నో యాప్‌లు పుట్టుకొస్తు న్నాయి. ఈ యాప్‌లు... చైనాకు చెందినవిగా పోలీసులు చెబుతున్నారు. కొందరు దేశంలోని నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుని, రుణాలిస్తున్నట్లు సైబర్ పోలీసులు అనుమానిస్తున్నారు. మరి కొందరు ఆర్బీఐ మార్గదర్శకాలను పట్టించుకోకుండా అధిక వడ్డీలు వసూలు చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి వాటిని అరికట్టడమే గాకుండా బ్యాంకుల రుణ పద్ధతిని ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్చాలి. బ్యాంకులు ప్రజల డబ్బుతో పెద్దలకు దోచిపెట్టడం గాకుండా బతికేందుకు అసవరమైన విధంగా రుణాలు ఇవ్వగలగాలి.

# సాంకేతిక సామర్థ్యంతో చైనా బెదిరింపు




సెల్ ఫోన్లు దగ్గరనుంచి ఔషధాలకు ఉపయోగించే మూలకాల విషయంలోనూ చైనాపైనే భారత్ ఆధారపడుతుండడం గత కొన్ని దశాబ్దాలుగా పరిపాటిగా సాగుతోంది. భారత్ ప్రభుత్వం స్వదేశీ తయారీ, ఆత్మనిర్భర్ అనే నినాదాలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన ఇంజినీర్లనే ఆయుధంగా చైనా ఉపయోగించి భారత్‌ను బెదిరిస్తోంది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి భారత్ తన ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని విస్తృతంగా పెంచుకోవలసిన అవసరం ఏర్పడింది. చైనా ఇటీవల ఐ ఫోన్ తయారీ సంస్థ 'ఫాక్స్‌కాన్' కు చెందిన భారతీయ పరిశ్రమల్లోంచి చైనా ఇంజినీర్లను వెనక్కి తీసుకోవాలని ఆదేశించడం ప్రత్యేకంగా గమనించవలసిన విషయం. ఫాక్స్‌కాన్ సంస్థ చైనా లోను, అంతర్జాతీయంగా ఎన్నో కేంద్రాలను నెలకొల్పి పేరుగడించిన ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ సంస్థ.తమిళనాడు, కర్ణాటక ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీల్లోని సిబ్బందిలో చైనా ఇంజినీర్ల భాగం 1 శాతం కన్నా తక్కువే అయినప్పటికీ, వారెంతో కీలకమైన ఇంజినీరింగ్ పాత్రను నిర్వహిస్తున్నారు. వారిని వెనక్కి తీసుకోవడంలో చైనా అసలు ఉద్దేశం ఈ ఫ్యాక్టరీల్లో ఉత్పత్తికి అంతరాయం కలిగించడమే. దీంతోపాటు భారత్ పారిశ్రామిక అవసరాలకు ముఖ్యమైన క్లిష్టమైన యంత్రాలను సరఫరా చేయడంలో విపరీత జాప్యం కలిగించాలన్న ఎత్తుగడ కూడా ఉంది.ఇది ఒక విధంగా ఆర్థికపరమైన బెదిరింపు. అంతర్జాతీయ సంస్థల కార్యకలాపాలను అణగదొక్కడానికి, వారి ఉత్పత్తి స్థావరాలను మార్చడానికి చైనా తన తయారీ సామర్థ వ్యూహాలను అమలు చేస్తుంటుంది. అమెరికాతో వాణిజ్య యుద్ధ తీవ్రతను తగ్గించడానికి చైనా ఇటీవల ప్రయత్నించినప్పటికీ, దాంతో సంబంధం లేకుండా చైనా అమెరికా వ్యూహాత్మక ఆర్థిక పోరాటంలో చిక్కుకోవడంతో భారత్ వంటి దేశాలు ఇరుకున పడుతున్నాయి. అమెరికాతో వియత్నాం కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంలో అమెరికాకు ఎగుమతి అయ్యే వియత్నాం ఉత్పత్తులపై 20 శాతం సుంకం విధించడానికి అమెరికా నిర్ణయించింది.అయితే వియత్నాం మీదుగా అమెరికాకు వెళ్లే చైనా ఉత్పత్తులపై 40 శాతం సుంకం విధిస్తోంది. అంటే చైనా ఉత్పత్తులను నిరోధించడానికే అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికా తన వాణిజ్య భాగస్వాముల ద్వారా రాయితీలను భారీగా పొంది తన మార్కెట్‌ను బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నిస్తుండగా, చైనా తన వాణిజ్య భాగస్వాములను తన ఉత్పత్తుల సరఫరా గొలుసులో బంధించడానికి తన తయారీ సామర్థ్యాన్ని వినియోగిస్తోంది. 2001లో ప్రపంచ వాణిజ్య సంస్థలో చైనా సభ్యత్వం పొందిన తరువాత పశ్చిమ దేశాలు, చైనా అవ్యక్త ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. చైనా నూతన ఆవిష్కరణలు, ఉన్నత స్థాయి తయారీపై దృష్టి కేంద్రీకరిస్తుండగా, తక్కువ విలువ గలిగిన తయారీని మిగతా దేశాలకు వదిలివేసింది. ఈ అవకాశాన్ని చైనా బాగా వినియోగించుకుని భారీ స్థాయిలో తన ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు సరఫరా చేయడం, వివిధ విభాగాల్లో సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవడంలో ముందుంటోంది.ఇంతే కాకుండా ప్రపంచం మొత్తం మీద లభించే చైనాలోనే అత్యధిక శాతం అపురూప ఖనిజాలు లభిస్తున్నాయి. వీటిని 90 శాతం వరకు చైనా శుద్ధి చేయగలుగుతోంది. ఇక భారత్ విషయానికి వస్తే చైనా సరఫరా చేసే ఎపిఐ (అప్లికేషన్ ప్రొగ్రామింగ్ ఇంటర్‌నెస్), ఎలక్ట్రానిక్ పరికరాల భాగాలు, కెమికల్స్, మ్యాగ్నెట్లు, మొదలైనవి ఎంతో బ్రహ్మాండంగా ఉంటున్నాయి. ఈ విధంగా చైనాపై ఆధారపడడాన్ని బాగా తగ్గించుకోవాలంటే ఉత్పత్తి అనుసంధాన రాయితీలు (పిఎల్ఐ) పథకాలను భారత్ ఎంతో ఆశాజనకంగా తీర్చిదిద్దాలి. స్వదేశీ తయారీని, సరఫరాను పటిష్టంగా రూపొందించడానికి చాలా అవసరాలు తీర్చవలసి ఉంటుంది. ఈ మేరకు సాంకేతిక విద్యపై సునిశిత పరిశీలన తప్పనిసరి. భారత్‌లో ఏటా 1.5 మిలియన్ ఇంజినీర్లు తయారవుతున్నారు. వీరిలో 10 శాతం మంది మాత్రమే 2024లో ఉద్యోగాలు పొందగలిగారు.ఇంకా మరికొన్ని అంచనాల ప్రకారం భారత్‌లో ఏటా 6 లక్షల మంది ఐటి ఇంజినీర్లు తయారవుతున్నారు. అయితే పరిశ్రమలకు కావలసింది మెటీరియల్ ఇంజినీర్లు. పరిశ్రమ ఉత్పత్తుల తయారీకి వీరి అవసరం చాలా ఉంది. కానీ వీరి సంఖ్య తగినంతగా లేదు. ఈ ఇంజినీర్ల వాసి, రాశి పెంచుకోవాలంటే ఆయా సాంకేతిక రంగాల్లో ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెట్టడం, ఆ మేరకు పాలనా విధానాలు అమలు చేయడం ఎంతో అవసరం. చైనా నుంచి సాంకేతికంగా నైపుణ్యంలోనూ, కీలక ఉత్పత్తుల సరఫరా లోనూ ఎదురవుతున్న సవాళ్లను, బెదిరింపులను ఎదుర్కోవాలంటే భారత్ ముందు చూపుతో నైపుణ్యంతో కూడిన సాంకేతికతను అభివృద్ధి చేయాలి. నిదానంగా తన సాంకేతిక నైపుణ్యంతో తయారీ రంగాన్ని విస్తరింప చేసుకోవాలి. లేకుంటే కీలకమైన యంత్రాల విడిభాగాల తయారీ, సరఫరాలో చైనా ముందు భారత్ దుర్బలంగా మారుతుంది.అయితే ఇటీవల భారత ప్రభుత్వం రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్, ఉద్యోగాల కల్పనకు ప్రోత్సహించడానికి బడ్జెట్‌లో రూ. 2 లక్షల కోట్ల వరకు వెచ్చించడానికి నిర్ణయం తీసుకోవడం ప్రశంసనీయమైన ఉద్దేశం అని చెప్పవచ్చు. వచ్చే రెండేళ్లలో 3.5 కోట్లకు పైగా ఉద్యోగాలు కల్పించాలన్నదే ఈ పథకం లక్షం. ఉపాధి అనుసంధాన ప్రోత్సాహక పథకంతోపాటు ప్రైవేట్ రంగ ఆవిష్కరణల కోసం తయారీ రంగం, ఆవిష్కరణలు, ఉద్యోగాల కల్పన, తదితర రంగాలను ప్రోత్సహించడానికే ఈ అద్భుతమైన ప్రణాళిక అని ప్రభుత్వం చెబుతోంది. ఇలాంటివి సత్ఫలితాలు అందిస్తే చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్ వర్ధిల్లుతుందని ఆశించవచ్చు.




# అవినీతి జాడ్యానికి మందేది

అక్కడ జరిగింది పండుగ, జాతర ఉత్సవాలు కాదు. ప్రభుత్వాధినేతల, రాజకీయ నాయకుల పర్యటనలు కావవి. ఆనందోత్సవాల కేరింతలు, మిరుమిట్లు కొలిపే పటాకుల హంగామా మధ్య ఊరు ఊరంతా సంబరాల కోలాహలం. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి తహసిల్దార్ ఎసిబికి పట్టుబడిన వ్యవహారంలో ప్రజలు స్పందించిన తీరు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ లంచగొండి ప్రతి పనికి ఓ రేటు ఫిక్స్ చేసి ప్రజలను పీడించిన తీరుతో ప్రజలు ఆ సంఘటన పట్ల ప్రదర్శించిన ఆహాభావాలు వారు ఎంత విసిగిపోయారో స్పష్టం చేస్తొన్నవి. రెవెన్యూ, హోమ్, పురపాలక పట్టణ అభివృద్ధి, నీటిపారుదల, స్టాంపులు రిజిస్ట్రేషన్లు మొదలగు విభాగాలలో రోజురోజుకూ అవినీతి వేళ్లూనుకుపోతోంది. సెటిల్‌మెంట్లకు అడ్డాలుగా పోలీస్ స్టేషన్లు మారుతున్నాయని, సివిల్ పంచాయితీలకు కేంద్రాలుగా వాటిని పోలీసులు మార్చుతున్నారని ఇటీవల హైకోర్టు తీవ్రమైన ఘాటు వ్యాఖ్యలు చేసింది.హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో పోలీస్ స్టేషన్లలో జరిగే అవినీతి దందాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. రాష్ట్రంలోని పలు మెడికల్ కాలేజీలు (%వీవఎఅఖ్మిశ్రీ జశీశ్రీశ్రీవస్త్రవం%) అడ్డదారుల్లో అనుమతులకోసం అనుకూల నివేదికలు ఇవ్వడానికి జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసి) అధికారులకు లంచాలు ఇచ్చిన విషయంలో సిబిఐ కేసు నమోదు కావడం అవినీతి పరాకాష్ఠకు మచ్చుతునక. 2025 తొలి అర్ధ సంవత్సరంలో (జనవరి -జూన్) ఎసిబి కేసుల పురోగతిని ఎసిబి డైరెక్టర్ జనరల్ కార్యాలయం జులై 1న ప్రకటన విడుదల చేసింది. ఎసిబి ప్రకటన వెలువడిన నాడే తలకొండపల్లి ఎంఆర్ఒ పట్టుబడి రెండో అర్ధ సంవత్సరంలో మొదటి కేసుగా నమోదు కావటం అక్రమార్కుల బరితెగింపు తనాన్ని సూచిస్తోంది. ఈ ఏడాది ఆరు నెలల కాలంలో ఎసిబి 126 కేసులను నమోదు చేసి 125 మందిని అరెస్టు చేసింది. రూ 24,57,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో రూ. 27,66,60,526 కోట్ల రూపాయల ఆస్తులను వెలికి తీసినట్లు ఎసిబి ప్రకటించింది.ప్రతి నిత్యం ఏదో ఒక శాఖకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులకు పట్టుబడుతున్నప్పటికీ అవినీతి తిమింగలాల్లో మార్పు రావడం లేదు. ప్రతిరోజు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో అవినీతి సంఘటనలకు సంబంధించి పుంఖాను పుంఖాలుగా కథనాలు వస్తున్నప్పటికీ ఏమాత్రం సిగ్గు, భయం లేకుండా ప్రజల ముందు బిచ్చగాళ్ల లెక్క చేతులు చాపుతున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులలో ఎసిబి జరిపిన దాడులలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు ఇఎన్‌సి, ఇఇ, హెచ్ఎండిఎ టౌన్ ప్లానింగ్ మాజీ డైరెక్టర్ల వందల కోట్ల రూపాయల అక్రమ ఆస్తులు బహిర్గతం కావడంతో ప్రజలు ఉద్యోగులను ఈసడించుకునే పరిస్థితులు నెలకొన్నాయి. బడా కాంట్రాక్ట్ సంస్థలు చేసే నాసిరకం పనులు గుడ్డిగా ఆమోదించినందులకు, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులను ఇచ్చినందులకు ప్రతిఫలంగా కోట్ల రూపాయల అక్రమ ఆస్తులను పోగేసుకున్నారు.రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా ఇది జరిగే పని కాదు. ఎసిబి లెక్కల ప్రకారం రోజురోజుకు కేసులుపెరుగుతున్నాయే తప్ప ఏమాత్రం తగ్గటం లేదు.

# ఇకనుం'చైనా' మారేనా

చైనా రాజకీయాలు ఎప్పుడూ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తాయి. చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీ (సిసిపి) నాయకత్వంలో జిన్‌పింగ్ గత దశాబ్ద కాలంగా అధ్యక్షుడిగా, పార్టీ జనరల్ సెక్రటరీగా అపారమైన అధికారాన్ని కేంద్రీకరించారు. 2025లో చైనా రాజకీయ రంగంలో కొత్త పరిణామాలు, ముఖ్యంగా జిన్‌పింగ్ అధికారం చుట్టూ ఊహాగానాలు తలెత్తుతున్నాయి. 2012లో అధికారంలోకి వచ్చిన జిన్‌పింగ్ చైనా రాజకీయ వ్యవస్థలో అధికారాన్ని గణనీయంగా కేంద్రీకరించారు. 2018లో అధ్యక్ష పదవీ కాలపరిమితిని రద్దు చేయడంతో జిన్‌పింగ్ జీవితకాలం అధికారంలో ఉండే అవకాశం సృష్టించబడింది. 2023 లో నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ ఆయనకు మరో ఐదేళ్ల పదవీకాలాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.ఇది ఆయనకు పార్టీ లోనూ, ప్రభుత్వంలోనూ ఉన్న బలాన్ని స్పష్టం చేసింది. అయితే, 2025 జూన్‌లో జరిగిన సిసిపి పొలిట్‌బ్యూరో సమావేశంలో కొత్త నియమాలు ప్రతిపాదించబడ్డాయి. ఇవి జిన్‌పింగ్ స్థాపించిన శక్తివంతమైన కమిటీలు, సంస్థలను నియంత్రించే లక్ష్యంతో ఉన్నాయని కొన్ని ఎక్స్ పోస్టులు సూచిస్తున్నాయి. ఈ నియమాలు జిన్‌పింగ్ ఏకపక్ష నిర్ణయాలను పరిమితం ) చేయడానికి, అధికార వికేంద్రీకరణకు దారితీసే సంస్థాగత యంత్రాంగాన్ని సృష్టించవచ్చని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ చర్చలు చైనా రాజకీయ వ్యవస్థలో అసాధారణమైనవి. ఎందుకంటే జిన్‌పింగ్ నాయకత్వంపై ఇప్పటివరకు ఉన్న పట్టు సడలిందని అసందిగ్ధ వార్తలు, ఊహాగానాలు వస్తున్నాయి.చైనాలో అధ్యక్ష అధికార మార్పిడి గురించి బహిరంగ చర్చలు, వార్తలు రావడం చాలా అరుదు. సాధారణంగా ఆ ఇనుప తెరలు చీల్చుకుని బయటకు రావడం దాదాపు అసాధ్యం.



అయితే, 2025లో చైనా ఆర్థిక సవాళ్లు.. ఇన్‌ఫ్లేషన్, యువతలో నిరుద్యోగం, మార్కెట్ సంక్షోభం జిన్‌పింగ్ నాయకత్వంపై ఒత్తిడిని పెంచాయని కొందరు భావిస్తున్నారు. జిన్‌పింగ్ అనారోగ్య సమస్యల కారణంగా రాజీనామా చేయవచ్చని లేదా అధికారం కొత్త నాయకుడి కి బదిలీ చేయ వచ్చని కొన్ని ఎక్స్‌లో పోస్టులు, ఊహాగానాలు చేస్తున్నాయి. ఉదాహరణకు, సైనిక సీనియర్ అధికారి జాంగ్ యూషియా ప్రస్తుతం సైన్యం లో గణనీయమైన అధికారాన్ని కలిగి ఉన్నాడని, జిన్‌పింగ్ ప్రభావం క్రమంగా తగ్గుతోందని కొన్ని పోస్టులు సూచిస్తున్నాయి. అయితే, ఈ ఊహాగానాలు ఎక్కువగా నిరూపితం కాని సమాచారంపై ఆధారపడి ఉన్నాయి.

# అద్భుతంగా రాణించిన మహమ్మద్ సిరాజ్

ప్రస్తుతం భారత్, ఇంగ్లాండ్ మధ్య రెండో టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. భారత్ 244 పరుగుల



ఆధిక్యంలో ఉంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత జట్టు 587 పరుగులు చేసి ఇంగ్లాండ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 407 పరుగుల వద్ద నిలిపింది. మొహమ్మద్ సిరాజ్ చిచ్చుర పిడుగులా ఇంగ్లీష్ జట్టుపై విరుచుకుపడ్డాడు. 19.3 ఓవర్లలో కేవలం 70 పరుగులకు 6 వికెట్లు పడగొట్టాడు. సిరాజ్ ఇప్పటివరకు భారత్ తరపున 37 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 102 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్‌పై అద్భుతంగా బౌలింగ్ చేయడం ద్వారా సిరాజ్ తన కెరీర్‌లో నాలుగో 5 వికెట్ల ఘనతను సాధించాడు. సిరాజ్ గతంలో ఆస్ట్రేలియా, వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లలో ఐదు వికెట్లు తీసిన ఘనతను సాధించాడు. 4 సంవత్సరాల క్రితం బ్రిస్బేన్‌లో ఆస్ట్రేలియాపై తొలిసారిగా ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టాడు.జూలై 2023లోనూ మొహమ్మద్ సిరాజ్ వెస్టిండీస్‌పై అద్భుతంగా రాణించి 5 వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత సిరాజ్ 2024 జనవరిలో దక్షిణాఫ్రికాపై కేవలం 15 పరుగులకు 6 వికెట్లు తీసుకున్నాడు. ఇప్పటివరకు అతని టెస్ట్ కెరీర్‌లో ఇవి అత్యుత్తమ గణాంకాలు. ఇప్పుడు మియాన్ భాయ్ ఇంగ్లాండ్‌పై కూడా తన బౌలింగ్ సత్తాను మరోసారి చాటుకున్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్‌లో సిరాజ్ ఓపెనర్ జాక్ క్రౌలీని పెవిలియన్‌కు పంపించాడు. జో రూట్, బెన్ స్టోక్స్ వంటి దిగ్గజ బ్యాట్స్‌మెన్ వికెట్లను టపా టపా పడగొట్టాడు. హైదరాబాద్ కు చెందిన ఈ ఫాస్ట్ బౌలర్ షోయబ్ బషీర్, బ్రైడాన్ కార్స్, జోష్ టంగ్‌లను కూడా తన ప్రదర్శనతో మోకరిల్లేలా చేశాడు.తొలి ఇన్నింగ్స్‌లో స్కోరు బోర్డులో 587 పరుగులు నమోదు చేయడం ద్వారా భారత జట్టు మ్యాచ్‌పై తన పట్టును బలోపేతం చేసుకుంది. ఇంగ్లాండ్ బ్యాటింగ్‌కు దిగినప్పుడు, వారు కేవలం 85 పరుగులకే 5 వికెట్లు కోల్పోయారు. అయితే, హ్యారీ బ్రూక్ , జేమీ స్మిత్ దూకుడుగా బ్యాటింగ్ చేసి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను తిరిగి ట్రాక్‌లోకి తెచ్చారు. ఇంగ్లీష్ జట్టు 407 పరుగులకు ఆలౌట్ అయింది. మూడో రోజు ముగిసే సమయానికి భారత్ తన రెండో ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ నష్టానికి 64 పరుగులు చేసింది. ప్రస్తుతం భారత్ 244 పరుగుల ఆధిక్యంలో ఉంది. నాల్గవ రోజు వారు బ్యాటింగ్‌కు దిగినప్పుడు, ఇంగ్లాండ్‌కు భారీ లక్ష్యాన్ని అందించడమే వారి లక్ష్యం.

# ఇంగ్లాండ్ 407 ఆలౌట్..

### -భారీ ఆధిక్యంలో భారత్

ఇంగ్లాండ్ తో జరుగుతున్న తొలిటెస్టులో భారత్ భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. శుక్రవారం మూడోరోజు ఓవర్ నైట్ స్కోరు 77/3 తో ఆటను కొనసాగించిన ఇంగ్లాండ్ 89.3 ఓవర్లలో 407 పరుగులకు ఆలౌటైంది. దీంతో భారత్ కు 180 పరుగుల భారీ ఆధిక్యం దక్కింది. వికెట్ కీపర్ బ్యాటర్ జెమీ స్మిత్ (207 బంతుల్లో 184 నాటౌట్, 21 ఫోర్లు, 4 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ (6/70) ప్రధాన పేసర్ గా ముందుండి జట్టును నడిపించి, హైయ్యెస్ట్ వికెట్లు తీశాడు. ఇప్పటికే వికెట్ క్షీణిస్తుండటంతో నాలుగో ఇన్నింగ్స్ లో బ్యాటింగ్ చేయడం కష్టంగా మారనుంది. దీంతో వీలైనంత త్వరగా పరుగులు సాధించి, ఇంగ్లాండ్ కాస్త భారీ టార్గెట్ ను నిర్దేశించ గలిగితే, ఇండియాకు విజయం దక్కవచ్చని తెలుస్తోంది. ఓవర్ నైట్ స్కోరు తో శుక్రవారం బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్ కు సిరాజ్ డబుల్ షాకిచ్చాడు. ఆట ఆరంభంలోనే జో రూట్ (22), కెప్టెన్ బెన్ స్టోక్స్ ను డకౌట్ చేశాడు. దీంతో 84 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. ఈ దశలో



బ్యాటింగ్ కి వచ్చిన స్మిత్.. హేరీ బ్రూక్ (234 బంతుల్లో 158,17 ఫోర్లు, 1 సిక్సర్) తో కలిసి అద్భుత భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరూ ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగి, సత్ఫలితాన్ని సాధించారు. వికెట్లు కోల్పోయినా వేగంగా పరుగులు రాబట్టారు. ముఖ్యంగా స్మిత్ దూకుడుగా ఆడుతూ లంచ్ లోపే 80 బంతుల్లో సెంచరీ నమోదు చేశాడు. కాసేపటికే బ్రూక్ కూడా సెంచరీని పూర్తి చేసుకున్నాడు. లంచ్ తర్వాత మొత్తం సెషన్ ఆడి, భారత బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టారు. టీ విరామం వరకు బ్యాటింగ్ చేశారు. అయితే ఆరో వికెట్ కు 303 పరుగులు జోడించాక, ఆకాశ్ దీప్ మ్యాజిక్ డెలివరితో బ్రూక్ ను ఔట్ చేసి ఈ భాగస్వామ్యానికి తెరదింపాడు..స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా లేని లోటును పూరిస్తూ, అనుభవం గల బౌలర్ గా సిరాజ్ జట్టును ముందుండి నడిపించాడు. ముఖ్యంగా ఇంగ్లాండ్ టెయిల్ ను త్వరగా పెవిలియన్ కు పంపడంతో భారత్ కు భారీ ఆధిక్యం దక్కింది. అంతకుముందు క్రిస్ వోక్స్ (5)ను ఆకాశ్ దీప్ స్లిప్ క్యాచ్ ద్వారా ఔట్ చేశాడు. ఆ తర్వాత సిరాజ్.. వరుసగా బ్రైడెన్ కార్స్, జోష్ టంగ్, షోయబ్ బషీర్ లను డకౌట్లు చేసి ఫైఫర్ తో పాటు ఆరు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు ఆకాశ్ దీప్ నాలుగు వికెట్లతో రాణించాడు. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ లోని పది వికెట్లను ఈ ఇద్దరు పేసర్లే తీయడం విశేషం. మరో ఎండ్ లో నాటౌట్ గా నిలిచిన స్మిత్.. అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ఇంగ్లాండ్ వికెట్ కీపర్ గా రికార్డులకెక్కాడు. ఓవరాల్ గా ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ లో ఆరుగురు బ్యాటర్లు డకౌట్ కావడం విశేషం. ఇక తొలి ఇన్నింగ్స్ లో ఇండియా 587 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

# సంజూ శాంసన్‌పై కాసుల వర్షం

### • రూ.26.60 లక్షలకు కొచ్చి బ్లూ టైగర్స్ కొనుగోలు

ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా ఉన్న సంజూ శాంసన్‌పై డబ్బుల వర్షం కురిసింది. కేరళ క్రికెట్ లీగ్ రెండో సీజన్‌లో సంజూ శాంసన్ అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచారు. ఈ దిగ్గజ ఆటగాడిని కొచ్చి బ్లూ టైగర్స్ రూ.26.60 లక్షలకు కొనుగోలు చేసింది. సంజూ శాంసన్ బేస్ ధర రూ.3 లక్షలు కావడం విశేషం. కొచ్చి జట్టు సంజూ శాంసన్‌ను రికార్డు ధరకు కొనుగోలు చేసి తమ జట్టులో చేర్చుకుంది. కొచ్చి జట్టు ఆయన్ను రికార్డు ధరకు కొనుగోలు చేసి తమ జట్టులో చేర్చుకుంది. ఈ ఫ్రాంచైజీ రూ.50 లక్షల బిడ్డింగ్‌లో సగానికి పైగా మొత్తాన్ని సంజూ శాంసన్‌పైనే ఖర్చు చేసింది. ఇది కేరళలో సంజూ శాంసన్ ఎంత పెద్ద ఆటగాడో తెలియజేస్తోంది. వేలం సమయంలో ఒక దశలో త్రిస్సూర్ టైటాన్స్ జట్టు సంజూ శాంసన్ కోసం పోటీ పడింది. వారు రూ.20 లక్షలు బిడ్ చేశారు, కానీ ఆ తర్వాత కొచ్చి బ్లూ టైగర్స్ అందరినీ ఆశ్చర్యపరుస్తూ బిడ్‌ను పెంచి సంజూ శాంసన్‌ను తమ సొంతం చేసుకుంది.తిరువనంతపురంలో జరిగిన వేలంలో అన్ని జట్ల బిడ్డింగ్ మొత్తం రూ.50 లక్షలు. అంటే ఒక జట్టు గరిష్టంగా రూ.50 లక్షలు మాత్రమే ఖర్చు చేయగలదు.



ఈ పరిస్థితుల్లో కొచ్చి బ్లూ టైగర్స్ తమ సగానికి పైగా డబ్బును సంజూ శాంసన్‌పైనే ఖర్చు చేసింది. ఈ నిర్ణయం అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది, కానీ సంజూ శాంసన్ స్థాయిని బట్టి ఏ జట్టు అయినా ఆయన కోసం ఇలా చేయడానికి సిద్ధంగా ఉంటుంది. ఇప్పుడు ఈ సీజన్‌లో కొచ్చి బ్లూ టైగర్స్ కోసం సంజూ శాసన్ ఏం చేస్తాడో చూడాలి.సంజూ శాంసన్‌తో పాటు కేరళ సహచరుడు విష్ణు వినోద్ పైనా భారీగా డబ్బు కురిసింది. ఆయన ఈ సీజన్‌లో రెండో అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచారు. ఆయన్ను ఆరీస్ కొల్లం రూ.13.8 లక్షలకు కొనుగోలు చేసింది. అలాగే జలజ్ సక్సేనాను అలప్పీ రిపుల్స్ రూ.12.4 లక్షలకు తమ జట్టులో చేర్చుకుంది.సంజూ శాంసన్ చివరిసారిగా ఐపీఎల్ 2025లో కనిపించాడు. 18వ సీజన్‌లో గాయం కారణంగా సంజూ చాలా మ్యాచ్‌లు ఆడలేకపోయాడు. సంజూ శాంసన్ అందుబాటులో లేకపోవడంతో ఆల్‌రౌండర్ రియాన్ పరాగ్ రాజస్థాన్ రాయల్స్‌కు నాయకత్వం వహించాడు. ఐపీఎల్ 2025లో సంజూ శాంసన్ 9 మ్యాచ్‌లలో 36 సగటుతో, 140 స్ట్రైక్ రేట్‌తో ఆయన 285 పరుగులు చేశాడు. ఇప్పుడు సంజూ శాంసన్ మరోసారి సిక్సర్లు, ఫోర్ల వర్షం కురిపిస్తూ కనిపించనున్నాడు.సంజూ శాంసన్ టీ20 క్రికెట్‌లో దూకుడుగా ఆడే ఓపెనర్‌లలో ఒకరు. తన కెరీర్‌లో ఈ కుడిచేతి వికెట్ కీపర్– బ్యాటర్ 304 మ్యాచ్‌లలో 29.68 సగటుతో 7629 పరుగులు చేశాడు. సంజూ శాంసన్ బ్యాట్ నుంచి 6 సెంచరీలు, 48 అర్ధ సెంచరీలు వచ్చాయి.



# చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ

ఇంగ్లండ్ గడ్డపై టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ దుమ్మురేపుతున్నాడు. ఇంగ్లండ్ అండర్ 19 జట్టుతో జరుగుతున్న యూత్ వన్డే సిరీస్‌లో భారత్ అండర్ 19 జట్టు తరపున బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ సరికొత్త చరిత్రను లిఖించాడు. యూత్ వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగంగా సెంచరీ బాదిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో పాకిస్థాన్ బ్యాటర్ కమ్రాన్ గులామ్ పేరిట ఉన్న ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డ్‌ను అధిగమించాడు. 2013లో ఇంగ్లండ్ అండర్ 19 జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కమ్రాన్ గులామ్ 53 బంతుల్లో శతకం సాధించాడు. తాజాగా 52 బంతుల్లో వైభవ్ సూర్యవంశీ సెంచరీ బాది ఈ 12 ఏళ్ల రికార్డ్‌ను అధిగమించాడు. భారత్ తరపున రాజ్ అంగద్ బవా.. ఉగాండపై 69 బంతుల్లో సెంచరీ చేశాడు. వైభవ్ తాజా శతకంతో ఈ రికార్డ్ కూడా బద్దలైంది.ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో వైభవ్ 78 బంతుల్లో 13 ఫోర్లు, 10 సిక్సర్లతో 143 పరుగులు చేశాడు. అతని ధాటికి ఈ మ్యాచ్‌లో టీమిండియా 28 ఓవర్లలోనే 234 పరుగులు చేసింది.ఈ మ్యాచ్‌లో టీమిండియా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. కెప్టెన్ ఆయుష్ మాత్రేతో కలిసి ఓపెనర్‌గా బరిలోకి దిగిన వైభవ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. ఆయుష్ మాత్రే(5) విఫలమైనా.. విహాన్ మల్హోత్రాతో కలిసి చెలరేగాడు. భారీ సిక్సర్లతో 24 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న వైభవ్.. అనంతరం మరింత దూకుడుగా ఆడి 52 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దూకుడుగా ఆడుతున్న అతన్ని బెన్ మెయెస్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో రెండో వికెట్‌కు నమోదైన 219 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. వైభవ్ ఔటైన తర్వాత భారత్ స్కోర్ నెమ్మదించింది. క్రీజులోకి వచ్చిన రాహుల్ కుమార్(0), హర్వన్ష్ పంగాలియా(0) డకౌటయ్యారు. అభిజ్ఞాన్ కుండుతో కలిసి విహాన్ మల్హోత్ర ఆచితూచి ఆడుతున్నాడు.

# బుమ్రా లేకపోతే వికెట్లు తీస్తా

### • టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్



ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్‌లో 6 వికెట్లు పడగొట్టడంపై టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ సంతోషం వ్యక్తం చేశాడు. ఈ ప్రదర్శన తనకు చాలా ప్రత్యేకమని చెప్పాడు. చాలా రోజుల తర్వాత ఐదు వికెట్ల ఘనత దక్కిందన్నాడు. సరైన లెంగ్త్‌లో బౌలింగ్ చేయడంతోనే 6 వికెట్లు దక్కాయని తెలిపాడు. తనకు బాధ్యత తీసుకోవడమన్నా.. ఛాలెంజ్ స్వీకరించడమన్నా చాలా ఇష్టమని తెలిపాడు. మహమ్మద్ సిరాజ్(6/70) నిప్పులు చెరగడంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 407 పరుగులకు ఆలౌటైంది. జెమీ స్మిత్(207 బంతుల్లో 21 ఫోర్లు, 4 సిక్స్‌లతో 184 నాటౌట్), హ్యారీ బ్రూక్(234 బంతుల్లో 17 ఫోర్లు, సిక్స్‌తో 158) భారీ సెంచరీలతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఈ ఇద్దరే 6వ వికెట్‌కు 303 పరుగులు జోడించారు. సిరాజ్‌తో పాటు ఆకాశ్ దీప్(4/88) నాలుగు వికెట్లు పడగొట్టాడు. దాంతో భారత్‌కు 180 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 13 ఓవర్లలో వికెట్ నష్టానికి 64 పరుగులు చేసింది. దూకుడుగా ఆడిన యశస్వి జైస్వాల్(22 బంతుల్లో 6 ఫోర్లతో 28) ఔటవ్వగా.. కరుణ్ నాయర్(7 బ్యాటింగ్)తో కలిసి కేఎల్ రాహుల్(28 బ్యాటింగ్) మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడాడు.మూడో రోజు ఆట అనంతరం తన ప్రదర్శనపై మాట్లాడిన సిరాజ్.. ఈ వికెట్‌పై ఓపికగా ఉండటం చాలా అవసరమని తెలిపాడు. ఇంగ్లండ్ ముందు భారీ లక్ష్యాన్ని నమోదు చేయడమే తమ ప్రణాళిక అని చెప్పాడు. ‘ఈ 6 వికెట్ల ప్రదర్శన అసాధారణం. ఎందుకంటే ఈ తరహా ప్రదర్శన కోసం నేను చాలా కాలంగా ఎదురు చూస్తున్నాను. బాగా బౌలింగ్ చేసినా నాకు వికెట్లు దక్కలేదు. ఇంగ్లండ్ గడ్డపై నాకు నాలుగు వికెట్ల ఘనతలు మాత్రమే ఉన్నాయి. దాంతోనే ఈ 6 వికెట్ల ప్రదర్శనకు నాకు చాలా ప్రత్యేకమైనది.వికెట్ చాలా స్లోగా ఉంది. కానీ పేస్ అటాక్‌ను లీడ్ చేస్తున్నప్పుడు నిలకడగా సరైన ప్రాంతంలో క్రమశిక్షణతో బౌలింగ్ చేయడం ముఖ్యం.

# ఉత్కంఠ పోరులో భారత మహిళల జట్టు పరాజయం

### - ఇంగ్లాండ్ 5 పరుగుల తేడాతో విజయం

ఇంగ్లాండ్ జట్టుతో లండన్ వేదికగా జరిగిన మూడో టీ20లో భారత మహిళల జట్టు పరాజయాన్ని చవిచూసింది. చివరి వరకు నువ్వా నేనా అన్నట్లు సాగిన ఉత్కంఠ పోరులో భారత్‌పై ఇంగ్లాండ్ పైచేయి సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత జట్టుపై ఇంగ్లాండ్ 5 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ ఓపెనర్లు సోఫియా డంక్లీ 75 పరుగులు, వ్యాట్ హాడ్జ్ 66 పరుగులతో అద్భుతంగా రాణించారు. భారత బౌలర్లలో అరుంధతీ రెడ్డి, దీప్తి శర్మలు తలో 3 వికెట్లు పడగొట్టగా.. శ్రీ చరణి 2, రాధా యాదవ్ ఒక వికెట్ తీశారు.ఆ తర్వాత 172 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ బరిలోకి దిగిన టీమిండియా 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 166 పరుగులు మాత్రమే చేసింది. చివరి 2 ఓవర్లలో టీమిండియా విజయానికి 20 పరుగులు అవసరం కాగా.. 19వ ఓవర్లో 8 పరుగులు వచ్చాయి. చివరి ఓవర్‌లో టీమిండియా విజయానికి 12 పరుగులు అవసరమయ్యాయి. క్రీజులో హర్మన్ ప్రీత్ కౌర్ ఉండడంతో విజయం భారత్‌దే అని అంతా భావించారు. కానీ చివరి ఓవర్ వేసిన ఇంగ్లండ్ పేసర్ లారెన్ బెల్ అద్భుతంగా బౌలింగ్ చేసి తొలి 5 బంతుల్లో 6 పరుగులు మాత్రమే ఇచ్చింది. చివరి బంతికి 6 రన్స్ అవసరం కాగా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ క్యాచ్ ఔటైంది. భారత్ 5 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది.భారత బ్యాటర్లలో ఓపెనర్లు స్మృతి మంధాన(49 బంతుల్లో 56) అర్ధ శతకం బాదగా.. షఫాలీ వర్మ(27 బంతుల్లో 47) చెలరేగిపోయింది. జెమీమా రోడ్రిగ్స్(20), హర్మన్ ప్రీత్ కౌర్(23) పరుగులు చేశారు. టీమిండియా ఇప్పటికే రెండు మ్యాచ్ ల్లో విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో విజయం సాధిస్తే సిరీస్ కైవసం చేసుకుని ఉండేది. ఇంగ్లండ్ బౌలర్లలో లారెన్ ఫైలర్ రెండు వికెట్లు తీయగా.. ఎకిలిస్టోన్, వాంగ్ తలో వికెట్ సాధించారు. ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 ఈ నెల 9న మాంచెస్టర్ వేదికగా జరగనుంది



# కన్నడ భాషపై మాట్లాడొద్దు..

## కమల్ హాసన్‌ను ఆదేశించిన కోర్టు

ప్రముఖ సినీ నటుడు, లోకనాయకుడు కమల్ హాసన్‌కు బెంగళూరు సివిల్ కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కన్నడ భాష లేదా సంస్కృతి గౌరవానికి భంగం కలిగించేలా ఇకపై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని ఆయన్ను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

గత నెలలో తన 'థగ్ లైఫ్' సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా కమల్ హాసన్ మాట్లాడుతూ "కన్నడ భాష తమిళం నుంచే పుట్టింది" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు కర్ణాటకలో తీవ్ర దుమారాన్ని రేపాయి. పలు కన్నడ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. కమల్ క్షమాపణ చెప్పడానికి నిరాకరించడంతో వివాదం మరింత ముదిరి, కర్ణాటకలో 'థగ్ లైఫ్' సినిమా విడుదల కూడా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మహేశ్ వూరాలా.. కమల్ వ్యాఖ్యలపై బెంగళూరు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అడిషనల్ సిటీ సివిల్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ఆర్. మధు.. కన్నడ భాష, సాహిత్యం, భూమి, సంస్కృతికి వ్యతిరేకంగా ఎలాంటి ప్రకటనలు చేయకుండా కమల్‌పై ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అంతేగాక ఆగస్టు 30న జరగనున్న తదుపరి విచారణకు కమల్‌ను వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశిస్తూ సమన్లు కూడా జారీ చేశారు

# వెంకీ సినిమాలో ఛాన్స్ కొట్టేసిన నిధి ?

ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం మూవీతో బ్లాక్ బస్టర్ ను అందుకున్న వెంకటేష్ తన తర్వాతి సినిమాల విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సంక్రాంతి వస్తున్నాం సినిమాతో వచ్చిన సక్సెస్ ను కాపాడుకోవాలని ఏ కథ పడితే అది కాకుండా మంచి స్క్రిప్ట్ తో సినిమా చేయాలని చూస్తున్నారు విక్టరీ వెంకటేష్. వెంకీ తన తర్వాతి సినిమాను ఎవరితో చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకీ ఓ సినిమాను చేయబోతున్నట్టు ఇప్పటికే వార్తలొస్తున్న సంగతి తెలిసిందే. వీరి కాంబినేషన్ లో రానున్న సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటనైతే రాలేదు కానీ ఆల్రెడీ ఈ సినిమాకు సంబంధించిన వర్క్స్ వేగంగా జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే త్రివిక్రమ్ సినిమాకు కథను లాక్ చేసి ప్రీ ప్రొడక్షన్ వర్క్ కూడా పూర్తి చేశారని అంటున్నారు. ఈ సినిమాకు వెంకట రమణ కేరాఫ్ ఆనంద నిలయం అనే టైటిల్ ను అనుకుంటున్నారని కూడా వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో వెంకీ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి సినిమాలకు త్రివిక్రమ్ రైటర్ గా పని చేయగా ఆ రెండు సినిమాలూ మంచి హిట్లుగా నిలిచాయి. కానీ త్రివిక్రమ్ డైరెక్టర్ గా మారాక మాత్రం వీరిద్దరూ కలిసి పని చేసింది లేదు. ఇన్నేళ్లకు వీరిద్దరి కాంబోలో సినిమా రానుండటంతో ఈ కాంబినేషన్ పై అందరికీ భారీ అంచనాలున్నాయి. అయితే ఈ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ న్యూస్ ఫిల్మ్ న్యూస్ సర్కిల్స్ లో వినిపిస్తోంది. వెంకీ- త్రివిక్రమ్ కాంబినేషన్ లో రానున్న సినిమాలో ఇద్దరు హీరోయిన్లు నటించనుండగా, అందులో ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ ఒక హీరోయిన్ గా ఫిక్స్ అయినట్టు సమాచారం. త్వరలో సినిమాను మొదలుపెట్టి 2026 సమ్మర్ కు రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. వెంకీ కెరీర్లో 77వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఎప్పుడొచ్చినా ఆడియన్స్ అంచనాలకు తగ్గట్టే ఉంటుందని భావిస్తున్నారు. కాగా నిధి అగర్వాల్ ప్రస్తుతం హరి హర వీరమల్లు, ది రాజా సాబ్ సినిమాల్లో నటిస్తున్న సంగతి తెలిసిందే.





# తెలుగు రాకపోయినా ఆ సినిమా 50 సార్లు చూశా

సపోర్టింగ్ రోల్స్ తో కెరీర్ ను స్టార్ట్ చేసిన వర్ష బొల్లమ్మ ఇప్పుడు టాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్ గా మారారు. మిడిల్ క్లాస్ మెలోడీస్, ఊరి పేరు భైరవకోన, స్వాతి ముత్యం లాంటి సినిమాలతో తెలుగు ఆడియన్స్ కు బాగా దగ్గరయ్యారు వర్ష బొల్లమ్మ. ఇప్పుడు తమ్ముడు సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకొచ్చిన వర్ష ఈ సినిమాలో ఓ హీరోయిన్ గా నటించారు. తమ్ముడు మూవీలో సప్తమి గౌడ మెయిన్ హీరోయిన్ గా నటించగా, వర్ష బొల్లమ్మ మరో ఫీమేల్ లీడ్ గా నటించారు. శుక్రవారం తమ్ముడు సినిమా రిలీజవగా, ఈ సినిమాలో వర్ష యాక్టింగ్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. తమ్ముడు సినిమా ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొన్న వర్ష బొల్లమ్మ పలు ఇంట్రెస్టింగ్ విషయాలను ఆడియన్స్ తో షేర్ చేసుకున్నారు. ఈ ప్రమోషన్స్ లో వర్ష బొల్లమ్మ తన వ్యక్తిగత విషయాలతో పాటూ ఆమె ఇష్టాలను కూడా బయటపెట్టారు. తాను రవితేజ విక్రమార్కుడు సినిమాను 50 సార్లు చూశానని, సమ్మర్ హాలిడేస్ లో తాను 50 రోజులు తన కజిన్ వాళ్ల ఇంటికి వెళ్లగా అక్కడ తన కజిన్ సిస్టర్ ప్రతీ రోజూ విక్రమార్కుడు సినిమా చూసేదని, తన కజిన్ వల్ల తాను కూడా విక్రమార్కుడు సినిమాను చూడాల్సి వచ్చిందని వర్ష బొల్లమ్మ తెలిపారు. అప్పట్లో డీవీడీలు ఉండటంతో క్యాసెట్ వేసుకుని దాదాపు తాను ఉన్నన్ని రోజులు తన కజిన్ ఒకే సినిమాను చూసిందని, విక్రమార్కుడు లోని సాంగ్స్ అంటే తన కజిన్ కు ఎంతో ఇష్టమని, పాటల కోసం ప్రతీ రోజూ సినిమా మొత్తాన్ని చూసేదని, ఒకవేళ సినిమా వేయకపోతే ఆ రోజు ఆమెకు చాలా కోపం వచ్చేదని, దీంతో చేసేదేమీ లేక తాను కూడా విక్రమార్కుడు సినిమాను చూశానని వర్ష తెలిపింది. అయితే ఆ సినిమా చూసేటప్పుడు తనకు ఎక్కువగా తెలుగు రాదని, కానీ ఆ సినిమాలోని డైలాగ్స్ మొత్తం తనకు గుర్తున్నాయని, తెలుగు రాకపోయినా రెండు మూడు సార్లు చూశాక విక్రమార్కుడు సినిమా చాలా అద్భుతంగా అనిపించిందని ఆ రోజులను గుర్తు చేసుకున్నారు వర్ష బొల్లమ్మ.

# సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి 'స్పిరిట్'




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుసబెట్టి సినిమాలు చేస్తున్నాడు. 'ది రాజా సాబ్' చిత్ర షూటింగ్ చివరి దశలో ఉండగా హను రాఘవపూడితో 'ఫౌజీ' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ రెండు చిత్రాలు కూడా వేర్వేరు జోనర్లలో తెరకెక్కుతుండటంతో అభిమానులు ఈ సినిమాల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ సినిమాల తర్వాత ప్రభాస్ నెక్ట్స్ చిత్రం దర్శకుడు సందీప్ రెడ్డి వంగాతో చేయనున్నాడు. 'స్పిరిట్' అనే టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాలో ప్రభాస్ ఓ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తాడు. అయితే, ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ నెలలో పట్టాలెక్కించేందుకు చిత్ర యూనిట్ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ వార్తతో అభిమానులు ఈ సినిమా ఎప్పుడెప్పుడు పట్టాలెక్కుతోందా.. ఎప్పుడెప్పుడు ఈ సినిమా నుంచి వరుస అప్డేట్స్ వస్తాయా అని మరింత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పెద్ది కోసం బుచ్చిబాబు నెక్స్ట్ లెవెల్ ప్లాన్..

ఇండస్ట్రీలో కొన్ని సినిమాల ఫలితాలు తర్వాత రాబోయే సినిమాలపై ప్రభావం చూపుతాయనే సంగతి తెలిసిందే. రీసెంట్ గా కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన థగ్ లైఫ్ సినిమా ఎఫెక్ట్ రామ్ చరణ్ సినిమా పెద్ది విషయంలో కూడా ఉంది. దానికి కారణం ఈ రెండు సినిమాలకూ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ కావడం. థగ్ లైఫ్ సినిమా డిజాస్టర్ లో రెహమాన్ పాత్ర కూడా ఉంది. ఆ సినిమాకు రెహమాన్ తన మార్క్ మ్యూజిక్ ఇవ్వడంలో విఫలమయ్యారు. దీంతో రెహమాన్ తమ హీరోతో చేస్తున్న పెద్ది సినిమాకు ఎలాంటి మ్యూజిక్ ఇస్తారోనని చరణ్ ఫ్యాన్స్ తెగ టెన్షన్ పడుతున్నారు. మణిరత్నం లాంటి తలలు పండిన డైరెక్టర్‌కే రెహమాన్ థగ్‌లైఫ్ లాంటి ఆల్బమ్ ఇస్తే, కేవలం ఉప్పెన అనుభవం మాత్రమే ఉన్న బుచ్చిబాబుకు ఎలాంటి మ్యూజిక్ ఇస్తారో అని కంగారు పడుతున్నారు. అయితే బుచ్చిబాబును అంత తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఉప్పెన సినిమా చేస్తున్నప్పుడు దేవీ శ్రీ ప్రసాద్ నుంచి ఛార్ట్‌బస్టర్ ఆల్బమ్ ను తీసుకున్న బుచ్చిబాబు ఇప్పుడు పెద్దికి కూడా అలాంటి ప్లానే వేశారట. పెద్ది సినిమాలో సాంగ్స్ కోసం బుచ్చిబాబు, రెహమాన్ కు ఒక్కో సాంగ్ కు మూడు రిఫరెన్సులు ఇచ్చి వాటిని బేస్ చేసుకుని తన సినిమాకు ది బెస్ట్ ఇవ్వమని కోరారట. అయితే బుచ్చిబాబు రిఫరెన్సులుగా ఇచ్చిన పాటల్లో ఎక్కువ శాతం ఒకప్పుడు రెహమాన్ ఇచ్చిన ఛార్ట్ బస్టర్ సాంగ్స్ ఉండటం విశేషం. ఇవన్నీ చూసి బుచ్చిబాబు కు మ్యూజిక్ పై ఎంత పట్టుందో తనకు అర్థమైందని రెహమాన్ తన డైరెక్టర్ గురించి రీసెంట్ గా ఓ సందర్భంలో ఎలివేషన్లు ఇస్తున్నారు. వాస్తవానికి థగ్ లైఫ్ సినిమాలో గొప్ప మ్యూజిక్ చేసేంత కథ కూడా లేదు. అయితే థగ్ లైఫ్ సినిమా డిజాస్టర్ తర్వాత ఉన్న అంచనాలను పెద్ది టీజర్ తోనే రెహమాన్ చాలా వరకు క్లియర్ చేశారు. గేమ్ ఛేంజర్ తో డిజాస్టర్ అందుకున్న చరణ్ ఫ్యాన్స్ కు పెద్ది మూవీకి సంబంధించిన ప్రతీ విషయంలోనూ కంగారు ఉండటం సహజం. కానీ రెహమాన్ మాటలు వింటుంటే బుచ్చిబాబు పెద్ది విషయంలో తాను అనుకున్న అవుట్‌పుట్ వచ్చే వరకు ఎవరినీ అంత ఈజీగా వదిలేలా కనిపించడం లేదు. ప్రస్తుతం పెద్ది షూటింగ్ నిర్విరామంగా జరుగుతుంది. ఈ నెలలోనే సాంగ్స్ షూట్ కు వెళ్లనున్నట్టు తెలుస్తోంది. వచ్చే ఏడాది మార్చి 27న పెద్ది సినిమా



# రేపిస్టులు ఎంపీలు అవుతుంటే లేని బాధ, రణ్‌బీర్‌పై ఎందుకు?: గాయని చిన్మయి



ప్రముఖ గాయని చిన్మయి శ్రీపాద సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. 'రామాయణం' చిత్రంలో శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటించడంపై ఓ నెటిజన్ అభ్యంతరం వ్యక్తం చేయగా, అత్యాచారాలకు పాల్పడిన వారు ఎన్నికల్లో గెలుస్తున్నప్పుడు లేని బాధ, ఓ నటుడి ఆహారపు అలవాట్లపై ఎందుకంటూ ఆమె ఘాటుగా ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో కొత్త దుమారం రేగింది. వివరాల్లోకి వెళితే.. 'బీఫ్ తినే రణ్‌బీర్ రాముడి పాత్ర పోషించడమేంటి? మన కర్మ!' అని ఓ సోషల్ మీడియా యూజర్ పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన చిన్మయి, "దేవుడి పేరుతో ఓ బాబాజీ రేప్ చేస్తాడు... జైల్లో నుంచి బయటకు వచ్చి ఎన్నికల్లో ఓట్లు కూడా సంపాదించి గెలవొచ్చు... ఇదే భక్త్ ఇండియా. అలాంటప్పుడు ఎవరో ఏదో తిన్నారంటే అదేం పెద్ద సమస్య కాదు కదా?" అంటూ బదులిచ్చారు. చిన్మయి వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొందరు ఆమెకు మద్దతు పలకగా, మరికొందరు విమర్శించారు. 'ఒక చెడ్డ పనిని మరోదానితో ఎలా పోలుస్తారు?' అని ఓ వ్యక్తి ప్రశ్నించగా, "రేపిస్ట్ ఎంపీగా గెలిస్తే మీకు ఏమీ అనిపించదు. కానీ బీఫ్ తినే వ్యక్తి రాముడి పాత్ర పోషిస్తే మాత్రం గుండెల్లో మంట. ఈ విషయంలో మీకేం అనిపించట్లేదా?" అని ఆమె ఎదురు ప్రశ్నించారు. తనను విమర్శించిన మరికొందరికి కూడా చిన్మయి తనదైన శైలిలో సమాధానాలు ఇచ్చారు. కాగా, నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో 'రామాయణం' చిత్రం తెరకెక్కుతోంది.

Editer : Gunnala Anil Reddy, Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy(Dist) Telangana Cell : 9705043131,8096660656